

# కథలు-1

సిహెచ్. వి.ఎస్. ఎన్. మూర్తి



చతుర్వేదుల. వెంకటసత్యనారాయణ మూర్తి

# కధలు

1.రాధా గోపాళం!!! ........................ 5 - 11

2.పండుటాకులు!!! ........................ 12 - 16

3.పండు – రావిచెట్టు .................... 17 - 36

4. రమేష్ బట్టల షాప్ ................ 37 - 45

"కధో-కథానికో"-ఏదైనా ఇది నాతొలిప్రయత్నం-పూర్తిగా చదివినతర్వాత

మీఅభిప్రాయం తెలియచేయండి నా ఈ తొలిప్రయత్నానికి!

సమాజంలో ఇప్పుడే నాకు కనపడిన కొత్త కోణం!!దీన్ని స్పృశిద్దామని

అనిపించింది.తప్పక చదవండి-ఇది మీ ఊహకు అందకుపోవచ్చు కూడా!!!

మీ మూర్తి

ఇంక కథలోకి వెళదాం...

# రాధా గోపాళం!!!

("బాపూ రమణల" మీద ఉన్న అభిమానంతో వాళ్ళు నామకరణం చేసిన, అచ్చంగా వాళ్ళ సొంతం అయిన ఈ పేరు నామొదటి కథకు/కథానికకు వాడుకున్నా-పై నుంచి కోప్పడరని ధైర్యంతో)

రాధా-గోపాల్ చక్కటి యువ జంట,అందునా కొత్తగా పెళ్ళైన జంట-కొత్తగా పెళ్ళైన జంటలు ఎలాఉంటారో వాళ్ళుకూడా అలాగే కాలం గడిపేస్తున్నారు.జామ్ జామ్మ్మగా "శ్రీకాంత్-స్నేహ"లాగా (అదేమిటి వీళ్ళిద్దరూ వచ్చారు మధ్యలోఅనుకుంటున్నారా వీళ్ళిద్దరే కదండీ"రాధా గోపాళం "సినిమాలో నాయికా నాయకులు) చిలిపి తగాదాలు సరాగాలు ఆడుతూ, సరససల్లాపాలతో రోజులు గడుపుతున్నారు ఈ రాధా- గోపాల్ కూడా!

ఇద్దరూ ఉద్యోగస్తులు అవడం మూలాన ఆఫీస్ నుంచి రాగానే చెట్టాపట్టాలేసుకొని రాత్రి భోజనానికి ఏ హోటల్ కో వుడాయిస్తారు,తీరుబడిఉంటే వంటచేసుకుంటారు.

కొత్త జంట అవడం మూలాన స్నేహితులు, చుట్టాలు ఆదివారాలు పండగరోజుల్లో వీళ్ళను భోజనాలకి పిలిచేవాళ్ళు "దీర్ఘ కాలపు వారాంతపు సెలవలు" వస్తే (ఇవి ఏమైనా కొత్తగా పెళ్లి అయినవాళ్ళకి ఇచ్చే సెలవలు అనుకుంటున్నారా;ఇలా ఇస్తే బావుండని కూడా పెళ్లి కావాల్సినవాళ్ళు, కొత్తగా పెళ్లి అయినవాళ్ళు అనుకున్నా అత్యాశ కాదు లేండి"లాంగ్ వీక్ ఎండ్స్" అంటే అర్థం అవుతుంది వీజీగామీకు)

ఎంచక్కా చుట్టుపక్కల చూడదగ్గ ప్రదేశాలకు చెక్కేసేవాళ్ళు-అలా కాలం గడుస్తోంది!

ఈ కొద్దిసంవత్సరాలలో వాళ్లకు ఇద్దరు మగ పిల్లలు,ఒక ఆడపిల్ల కలిగారు,కాలం దూసుకుపోతోంది. రాధా- గోపాల్ పూర్తిగా కుటుంబబాధ్యతలతో బిజీ అయిపోయారు ఉద్యోగంతో బాటు-తలములకలయిపోయారు!

ఉన్నతతరగతికి చెందినవాళ్ళు అవడంవల్ల ఆర్థికఇబ్బందులు ఏమీ లేవు-ఇద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉండి నిండు సంపాదనతో ఉన్నారు.పిల్లలకు కావాల్సిన,అవసరం అయినవన్నీసౌకర్యాలు అమర్చారు-అడిగింది కాదనకుండా.పిల్లలు కూడా చాలా మంచివాళ్లు మరియు మెరికల్లాంటి వాళ్ళుఅవడం మూలాన చదువుల్లో కూడా భేషుగ్గా పైకి రాగలిగారు.ఇద్దరబ్బాయిల మధ్య అమ్మాయి అవడంతో ఆడపిల్ల చాలా గారాబంగా పెరిగింది-పెంకిగా అవకుండా.ఇంటికి లక్ష్మీదేవిలా చూసేవారు ఇంటి ఆడపడుచు అని.ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఉండటంవల్ల అటు అన్నయ్య ఇటు తమ్ముడు కూడా ప్రేమగా చూసేవాళ్ళు.

రోజులు,సంవత్సరాలు సాఫీగా గడిచిపోతున్నాయి,కాలం పరుగెడుతోంది మనిషి మనసుకు మల్లే-రాధా గోపాల్,ఇద్దరికీ వయసు మీదపడుతోంది.పిల్లల మధ్య పెద్ద ఎడం లేకపోవడం వల్ల చకచకా ఎదిగిపోయారు ఇట్టే.పెద్ద పిల్లాడు పైచదువుల కోసం అమెరికావెళ్ళాడు.
అమ్మాయి చదువు అయిపోవడంతో కళాశాల ప్రాంగణంలో వుండగానే ఉన్న నగరంలోనే మంచి కంపెనీలో ఉద్యోగం సంపాదించింది.

కాలేజీ స్నేహితులతో బాటు ఆఫీస్ లో కొత్తగా పరిచయం అయినవాళ్ళతో సినిమాలతో షికార్లతో కాలం చక్కగా గడిచిపోతోంది.అన్నయ్య అమెరికా వెళ్లడంవల్ల తమ్ముడికి తీరిక ఉన్నప్పుడు సినిమాలకు తీసుకు వెళ్ళేది ఇప్పుడు సంపాదనాపరురాలు కదా!

చుట్టుపక్కలవాళ్ళకి, చుట్ట పక్కాలకి ఈర్ష్య పుట్టేంత సుఖంగా ఉంది ఆ కుటుంబం ఏ దిష్టి తగలకుండా చాలా తక్కువమందికి భగవంతుడు ఈ అదృష్టం కలిగిస్తాడు.ఇదేనేమో పూర్వజన్మసుకృతం అంటే!

గోపాల్ కి పదిమందిలో మంచిపేరు ఉండటం వల్లా,అమ్మాయి రూపవతి కూడా అవటం మూలాన చాలా పెళ్లిసంబంధాలు రావడం మొదలు అయ్యాయి.ఎవరో తెలిసినవాళ్ళ ద్వారా ఒక సంబంధం రావడం జరిగింది. పిల్లాడు లండన్ లో మంచి ఉద్యోగంలో ఉన్నాడు,మంచి కుటుంబం అని కూడా మధ్యవర్తులు చెప్పడం మూలాన వెంటనే సంబంధం కుదిరిపోయింది-అబ్బాయి అమ్మాయి ఇరువురు ఇష్టపడి సరే అనడంతో అమ్మాయి కొన్నాళ్ళు ఆగుదామని అన్నా,వాళ్ళకి తగ్గ మంచిసంబందం రావడం వల్ల-అమ్మాయికి కూడా నచ్చడంవల్ల పెళ్లికుదరటం,జరిగిపోవడం చకచకా అయిపోయాయి.

ఇంట్లో ఆడపిల్ల ఒక్కతే అవడంవల్ల పెళ్లి అంగరంగవైభవంగా చేసారు.

అందరికీ ఓ తీపి గుర్తుగా నిలబడిపోయేట్టు-"పిల్ల అదృష్ట వంతురాలు" అని వచ్చిన వాళ్లంతా అనుకునేట్టు కూడా!!! అమెరికానుంచి పెద్దబ్బాయి పెళ్లికి వచ్చి వెళ్ళిపోయాడు హడావుడిగా-ఎక్కువ సెలవలు లేకపోవడం మూలాన.అమ్మాయి-అల్లుడూ పెళ్ళితర్వాత ఓ పదిరోజులు ఉండి వాళ్ళు లండన్ వెళ్లి పోయారు.

అప్పటిదాకా గలగలా సందడిగా ఉన్న ఆ ఇల్లు ఒక్కసారిగా మూగ బోయినట్లు అయింది.పైపెచ్చు చిన్న అబ్బాయి చదువు ఇంకో ఏడాదిలో అయిపోతుంది.దానితో రాధా-గోపాల్ కి బెంగ మొదలయ్యింది.

వీడు కూడా రెక్కలొచ్చి గడపదాటి వెళ్ళిపోతే ఒంటరివాళ్లం అయిపోతాం అని బిక్కుబిక్కుమంటూ ఇద్దరే ఉండాలని. ఈ లోపు పెద్దవాడి చదువు అయిపోవడం అక్కడే ఒకఅమ్మాయిని ఇష్టపడటం జరిగింది ఇండియాకి వచ్చి పిల్ల తల్లిదండ్రులుకూడా సరే అన్నతర్వాత అబ్బాయి వివాహం కూడా చేసారు!

ఈ వంకన ఇల్లు మళ్లీ కాస్త సందడి అయింది చాలారోజుల తర్వాత అమ్మాయి-అల్లుడు రాకతో. పెళ్లి అవగానే అబ్బాయి-కోడలు అమెరికా వెళ్లిపోయారు.అలాగే అమ్మాయి-అల్లుడు లండన్ వెళ్ళి పోయారు-తల్లిదండ్రులను రమ్మని ఆహ్వానించి!

పిల్లలు మంచి చదువులు చదువుకొని ప్రయోజకులు అయి-వారివారి జీవితాల్లో స్థిరపడితే ఏ తల్లిదండ్రులకైనా అంతకన్నా కావాల్సింది ఏముంది!

అంతా సాఫీగా సవ్యంగా సాగుతున్న రాధ-గోపాల్ జీవిత నౌకలో ఓ చిన్న కుదుపు మొదలయ్యింది. కథలో అసలు మలుపు ఇక్కడ మొదలయ్యింది...

ఇంత సాఫీగా సాగుతున్న కథలో రాధ గురించి పాఠకులకి ముందుగా చెప్పడం జరగలేదు-పాఠకుల్ని ఇబ్బందిపెట్టడం ఇష్టంలేక కథ రసకందాయంగా,సాఫీగా గడిచిపోతోంది అని.

రాధ చాలా పద్ధతిగా, క్రమ శిక్షణగా,అతిశుభ్రంగా ఉండే మనిషి.ఇల్లు కూడా ఎప్పుడూ కడిగిన అద్దంలా ఉండేది.పిల్లల స్నేహితులు,గోపాల్ సహాధ్యాయులు స్నేహితులు,రాధ స్నేహితులు,బంధువులు,ఇలా ఇంటికి వచ్చిన అందరూ మెచ్చుకునే వాళ్ళుసహజంగానే- అది గర్వంగానే ఉండేది ఇంట్లోవాళ్ళకి అప్పట్లో.

ఇంట్లోవాళ్ళకి కొంచెం ఇబ్బందిగా ఉన్నా,కొన్ని విషయాల్లో చిన్నచిన్నసంవాదాలు జరిగేవి.చివరాకరికి ప్రతీసారీ ఆవిడ మనసు కష్టపెట్టడం ఇష్టంలేక పిల్లలూ గోపాల్ సర్దుకుపోయేవారు-అక్కడ వచ్చింది అసలు చిక్కు.

అది పెద్ద సమస్యగా తయారయింది ఇంట్లోఇప్పుడు-ఇన్నాళ్లు సహనం పాటించిన గోపాల్ రాధకి - చిన్నబ్బాయి కూడా వాళ్ళ అమ్మకి కొద్దిగా చెప్పడం మొదలు పెట్టారు,ఘర్షణల దాకా వెళ్ళేది.ఇలా కాలం సాగుతుండగానే చిన్నబ్బాయి చదువు అయిపోవడం ఉద్యోగం వచ్చివేరే ఊరికి వెళ్లి పోవడం జరిగింది.

ఒకప్పటి యువజంట వార్ధక్యంలోకి అడుగుపెట్టారు.మిగిలింది రాధా గోపాల్ అంత ఇంట్లో!విసుగులు, చిరాకులు పెరిగిపోయాయి.మాటామాటా పెరగడం ఎక్కువైంది. రాధలో ఒక రకమైన ఒంటరితనం మొదలయింది,దానితో సహనం కూడా పోయింది.

రాధ ప్రవర్తనతో గోపాల్ కూడా సహనం కోల్పోయి అరవడం మొదలుపెట్టాడు- ఆమె ధోరణితో;మీరు ఊహించుకోవచ్చు భార్యాభర్తల మధ్య కీచులాటలు ఎలా మారతాయో చివరకి. చిలికిచిలికి గాలివానగా రూపందాల్చడం మొదలయ్యింది దాదాపుగా ప్రతీరోజూ-ఇద్దరు ''అసహనపు సింహాసనం'' మీద కూర్చుంటే సఖ్యత ఎక్కడ ఉంటుంది!

చివరికి ఏస్థాయికి చేరిందంటే ఎవరి గదులు వాళ్ళకి అయిపోయినాయి.గోపాల్ ఇంట్లో మేసిలేటప్పుడు పొరపాటున చేయి తగిలినా, మనిషి తగిలినా రాధ విసుక్కోవడం మొదలయ్యింది ''చూసుకొని నడవచ్చుగా'' అని. అతని పొడ అంటే గిట్టనట్టు అయింది.అవసరం అయితే తప్ప వాళ్ళమధ్య మాటలు మృగ్యం అయిపోయినాయి.గోపాల్ ఆఫీస్ పనిమీద ఊరువెళితే ఫోన్ లో మాత్రం ప్రేమగా మాట్లాడేది. ఊరునుంచి వచ్చిన తర్వాత మళ్ళీ షరామామూలే.

ఈ వింత మనస్తత్వం,తీరు గోపాల్ కి అంతు చిక్కలే.ఎంత సర్దుకున్నా అయిన దానికి,కాని దానికి గోపాల్ మీద చిరాకుపడటం అతను సర్దుకునే స్థాయి దాటి పోయాడు. పిల్లలతో చూచాయగా ఈ విషయం చెప్పాడు.పిల్లలు అడిగినప్పుడు అలా ఏంలేదని ఎప్పటిలాగానే ఉన్నానని చెప్పేది రాధ. తర్వాత గోపాల్ తో ఈ విషయమై ఘర్షణ పడేది. ''పిల్లలతో కాకుండాఎవరితో చెప్పుకుంటా నామనసులో మాట'' అని గోపాల్ బదులు చెప్పేవాడు''-''అక్కడికేదో మిమ్మల్నికష్టపెడుతున్నట్టు పిల్లలకి చెప్పుకుంటూ, నన్నుచెడ్డదానిగా చేస్తున్నారు పిల్లలముందు'' అని కొత్త రాగం మొదలయింది.

ఇక భరించే శక్తి-ఓపిక లేక గోపాల్ ఒకరోజు విషయం తేల్చుకోవాలి అనుకున్నాడు రాధతో- ఒకరోజు రాధతో ఇలా అన్నాడు! ''మనం కలసి జీవించడంలేదు,కలిసి ఒకఇంట్లో ఉంటున్నాం ఏ ప్రేమా ఆప్యాయతలు లేకుండా-యాంత్రికంగా.నా పొడగిట్టట్లేదు, నా మాట పడట్లేదు; అయినదానికి కానిదానికి విసుక్కుంటున్నావ్.ఈ వయసులో ప్రశాంతంగా బతకాల్సిన వాళ్లం.భగవంతుడు మనకు ఏ లోపం చెయ్యలా.అడగకుండానే అన్నీ ఇచ్చాడు.

నాకా వయసు పైపడుతోంది.ఇక నాకు భరించే ఓపిక లేదు.బతికనన్నాళ్లు ఇలాగైతే తట్టుకోలేను. నేను వేరే ఇల్లు తీసుకొని ఉంటా.ఎప్పుడయినా వచ్చివెళ్తుంటా,అదీ నీకు సరే అయితే.ఇరుగు పొరుగు అడుగుతారు అనే సంశయం ఉంటే మన అబ్బాయిల దగ్గరకో, అమ్మాయి దగ్గరకో కొన్నాళ్లకు వెళ్ళా అని చెప్పు.ఈవయసులో విడిపోవడం  ఇద్దరికీ మంచిదికాదు-ఇది నా కచ్చితమైన అభిప్రాయం''!

''ఏమో నీకు నేను ఎదురుగా కొన్నాళ్ళు కనపడకుండా ఉంటే నువ్వు స్థిమితంగా  ఉంటావేమో, నువ్వు ప్రశాంతంగా ఉండొచ్చు.నా దోవన నేను బతికేస్తా ఎలాగో అలాగ.నేనూ ప్రశాంతంగాఉంటా. నేనేదో వ్యాపకంతో నా సమయం పొద్దుపుచ్చుతా; నీలో మార్పువచ్చి నేనురావాలి అనుకుంటే తప్పకుండా తిరిగివస్తా.అలా కాకుండా ఇలాగే జరిగిపోవాలి అనుకుంటే అది సాధ్య కాదు. ఏంచేతంటే నాకు ఇక ఈ వాతావరణం తట్టుకునే మానసిక శక్తి లేదు.పిల్లలకి కూడా ఈ విషయం చెప్పిఅడుగు బయటికి వేస్తా'' అన్నాడు.రాధ ఏమీమాట్లాడలా. ముభావంగా,స్తబ్దుగా ఉండిపోయింది, ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

మరునాడు ఉదయాన గోపాల్ తో రాధ ఈ ఏర్పాటుకు,కొన్నాళ్ళ మార్పుకు సరే అంది.పిల్లలకి చాలా ప్రశాంతంగా ఇద్దరూ చెప్పారు.వినటానికి చాలా బాధగా ఉన్నా పిల్లలు ఈ ఏర్పాటుకి ఒప్పుకున్నారు అయిష్టంగానే.వాళ్ళవద్దకు రమ్మన్నారు రాధా గోపాల్ ఇష్ట పడలేదు,వాళ్ళ దగ్గరకి వెళ్ళటానికి!

గోపాల్ అడుగు బయటికివేసాడు తను అనుకునే కొత్త జీవితంలోకి-చాలా భారమైన  హృదయంతో, రాధ వెనుకనుంచి నిర్వేదంతో చూస్తోంది గోపాల్ వంక-లోలోపల  గోపాల్ ని ఆగమని చెప్పాలని ఉన్నా నిశ్శబ్దంగా ఉండిపోయింది-ఇందులో తన తప్పేమీ లేదుకాబట్టి!

తిరిగి వాళ్ళు కలిసిఉంటారా!
అలాగే ఉండిపోతారా_ _ _. విడివిడిగా!
లేదా విడిపోతారా ఎప్పటికీ!
ఈ నిర్ణయం సరి అయిదేనా!

ఇవన్నిటికీ కాలమే మనకు సమాధానం చెప్పాలి.ఇది సమాజంలో కొత్తగా చోటు చేసుకుంటున్నమార్పు-అలా అని ఈ సమస్యని భూతద్దంలో చూపించే ఉద్దేశమూ నాకు లేదు- రాధని దోషిగా చేసే ఉద్దేశ్యం ఏమాత్రం లేదు.అలా ఎవరైనా అనుకుంటే ఈ కథలో రాధ పాత్ర బదులు గోపాల్ ని ఊహించుకోండి. ఇక్కడ నేను చెప్పదల్చుకున్నది ''సర్దుబాటు అనేది భార్య భర్త ఇద్దరికి ఉండాలి అని'' వయసుతో నిమిత్తం లేదు.ఇది ఎవరి విషయంలో అయినా జరగొచ్చు భార్యా భర్తల్లో!!!

భార్యా భర్తల్లో ఒక్కళ్ళే జీవితాంతం సర్దుకోవాలి అని ఎవరు అనుకున్నా ఇలా జరగడానికి ప్రస్తుత సమాజంలో అవకాశాలు మెండు.ఎందుకంటే పిల్లలు ఎంత మంది ఉన్నా-తల్లితండ్రులను పట్టించుకునే తీరుబడిలేదు- ఎవరికీ కూడా. అలాగని వాళ్ళ భవిష్యత్ వదులుకొని తల్లిదండ్రులను చూసుకోమని చెప్పడం భావ్యంకాదు- రోజుల్నిబట్టి మరియు లోకం తీరుని బట్టి కూడా!

ఇది ఎలాంటి వయసు అంటే, కాలగర్భంలోకి క్రమంగా దగ్గరగా వెళ్లే వయసు ఏ తల్లిదండ్రులకైనా- ఎందుకంటే ఇది జీవితంలో చివరి అంకం! చివరికి మిగిలేది ఒక్కరే, అప్పటివరకైనా ఇద్దరూ సర్దుకుని కలసిఉంటే ఇరువురూ సంతోషంగా ఉంటారు చివరి వరకూ.పిల్లలు కూడా ప్రశాంతంగా వాళ్ళ జీవితాలు వాళ్ళు బతికేస్తారు- తల్లితండ్రుల గురించి ఏ బెంగా లేకుండా.తెగేదాకా ఎవరూ, ఏదీ లాగకూడదు, పట్టువిడుపులు ఉండాలి నామాటే నెగ్గాలి అనే స్వభావంతో కాకుండా-మరీ ముఖ్యంగా జీవితం విషయంలో.

ఇంట్లో ఉన్న ఈవాతావరణంలో ఒకవేళ కలసి ఉన్నా ఇద్దరూ సుఖంగా ఉండలేరు మిగిలిన జీవితంలో అంతా నిస్పృహే మిగులుతుంది ఇద్దరికీనూ- రోజూ ఉండే గొడవలతో!!!

రాధ కారణాలు రాధకు ఉండొచ్చు-సముచితంగా.పాఠకులు అనుకోవచ్చు రాధకి మొదట్లోనే గోపాల్, పిల్లలు తన స్వభావం గురించి చెప్పి ఉంటే రాధ- గోపాల్ కి ఈ పరిస్థితి కలిగేది కాదేమో అని. కానీ వాళ్ళ కారణాలు వాళ్ళకీ ఉన్నాయి.వాళ్ళ దృష్ట్యా  అది కొద్ది సర్దుబాటు వాళ్ళ తరపున రాధ యెడల. అదీ కాకుండా రాధ అప్పటి ప్రవర్తనకు (PMS) పీ.ఎం.ఎస్.గానీ,మెనోపాజ్ గానీ తోడు అయిఉండచ్చు అనే అవగాహన వాళ్ళందరికీ ఉంటంవల్ల కావచ్చుకూడా- ఈ కారణాలూ కొట్టి పారేయలేం!

ఇంట్లోని ఈ పరిస్థితి- రాధ తన స్వభావం,ప్రవర్తన మార్చుకోవడానికి అవకాశం లేకుండా చేసింది, పైపెచ్చు బలపడి పోయింది కూడా,తన తప్పేమీలేదు అనే భావనతో. అదీ కాకుండా ఈ వయసులో ఆమెకు మారడం కష్టం అనిపించి ఉండొచ్చు కూడా!!

ఇది పైకి చాలా చిన్నగా కనపడ్డా, చాలా సునిశితమైన విషయం ప్రస్తుత సమాజం ఉన్న పరిస్థితుల్లో. నేను రాసినది ఒకటే పరిష్కారం కాదు.ఇలా జరగడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పడం మాత్రమే నా ఉద్దేశం,ఈ స్పృశింపు!!! ఇది కథగానే ఉండాలని, భార్యా భర్తలందరూ తుది మలుపు వరకు జీవితాంతం కలిసి ఉండాలనే నా ఆకాంక్ష.

అదీకాకుండా ప్రతీ మనిషి -ఎవరి కారణాలని వాళ్ళు సమర్ధించుకోవడం మానవ సహజం.ఏది ఏమైనా వాళ్ళ భవిష్యత్తు అనుకూలంగానే ఉండాలని సుఖాంతం అవ్వాలని ఆశిద్దాం!!!

''జీవితంలోని అసహనానికి మందు సహనమే''-వేరే మార్గమే లేదు!!

అదీకాకుండా ప్రతీ మనిషి -ఎవరి కారణాలని వాళ్ళు సమర్ధించుకోవడం మానవ సహజం.ఏది ఏమైనా వాళ్ళ భవిష్యత్తు అనుకూలంగానే ఉండాలని సుఖాంతం అవ్వాలని ఆశిద్దాం!!! ‘‘జీవితంలోని అసహనానికి మందు సహనమే’’-వేరే మార్గమే లేదు!!

# సమాప్తం!!!

# పండుటాకులు!!!

ఒక రోజు నాన్న పోయినట్టు కబురు వచ్చింది,ఆవార్త విని దుఃఖం పొంగుకొచ్చింది, నా భార్య ఇందిరకి ఆ విషయం చెప్పడంతో ఓదార్పుగా నాదగ్గర కూర్చుంది.

కొంతసేపటికి ఇందిర అంది"ఏమండి అత్తయ్యగార్ని మన దగ్గరకు తీసుకు వచ్చేద్దాం కార్యక్రమాలు అన్నీ అయిన తర్వాత,మన దగ్గరే ఉండిపోతారు ఎప్పటికీ’’!

చెప్పొద్దూ నా కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి ఇందిర మాటలకి.ఇందిరకి, మా పిల్లలకి అమ్మన్నా, నాన్నన్నా చాలా ప్రేమ-ఆ విషయంలో నేను చాలా అదృష్టవంతుణ్ణి. అంత బాధలోనూ ఇందిర మాటలు చాలా ఉపశమనాన్ని ఇచ్చాయి.

కాస్తంత స్థిమితపడ్డ తర్వాత ప్రయాణానికి ఏర్పాట్లు చేసే ప్రయత్నంలో పడిపోయాను.ఫ్లైట్ టిక్కెట్లు ఆన్లైన్లో కొనేసి బట్టలు సర్దుకుని ఎయిర్ పోర్ట్ కి ఇందిరా నేను బయలు దేరాం-దారి పొడుగునా పాత జ్ఞాపకాలే.

అమ్మా నాన్నా ఇద్దరూ ఎంత చెప్పినా వినకుండా పల్లెటూరులోనే ఉండిపోయారు  వార్ధక్యం ముంచుకొస్తున్నా.నాన్న పుట్టిన ఊరు అవడం వాళ్ళ దైనందిన జీవితం సాఫీగా గడిచిపోతుంది-ఇరుగుపొరుగు బోలెడుమంది వాళ్లకి కావాల్సిన సహాయం చేయడానికి. అమ్మా నాన్న ఇద్దరూ విశ్రాంతజీవితం హాయిగా గడుపుతున్నారు-ఒకరికొకరు తోడుగా.ఇప్పుడు నాన్న ఈ గ్రహాన్నే వదిలేసి ఎవరికీ అందనంత దూరం వెళ్లి పోయారు;ఈ పరిస్థితుల్లో అమ్మకి మరీ కష్టం-ముఖ్యంగా ఈ వయసులో-వార్ధక్యం మనిషికి శాపమేనేమో-ముఖ్యంగా వంటరిగా వుండేవాళ్లకి!

మా కుటుంబంలో ఇంతమందిమి తోబుట్టువులు ఉండటంవల్ల ఎవరి దగ్గరైనా ఉండమని మరీ మరీ అడిగాం అందరం.వాళ్లకి ఆ వూరుమీద ఉన్న ప్రేమతో కదలటానికి ఏమాత్రం ఇష్టపడలా ఇద్దరు-''ఇక్కడే రాలి పోవాలర్రా మేము అనేవాళ్ళు ఎప్పుడూ'' నవ్వుతూ!

మాది పెద్ద కుటుంబం- అప్ప చెల్లెళ్ళు అన్నదమ్ములతో; తోబుట్టువులు అందరూ ఎక్కడెక్కడో స్థిరపడి పోయారు.వాళ్ళ పిల్లలు మనవరాళ్లతో కొంతమంది-వాళ్లకి తోడుగా-పిల్లల దగ్గరే ఉండిపోయారు. ఎవరి కుటుంబాలు వాళ్లకి-ఎవరికీ తీరుబడి లేని రోజులాయె.అప్పటికి ఎవరి వీలునిబట్టి వాళ్ళు వూరికి వెళ్లి అమ్మనాన్నల్ని చూసి వస్తుండేవాళ్ళం.

కొంతమంది వేరేదేశాల్లో ఉన్నవాళ్ళ పిల్లల దగ్గరకి వెళ్లి వస్తూ వుంటారు తరచూ;

ఏదైనా ప్రత్యేక సందర్భాలు వస్తే మాత్రం సాధ్యమైనంత మంది ఒక్కసారే కలవడానికి ప్రయత్నం చేసే వాళ్ళం-మాపల్లెకు వెళ్లేవాళ్ళం-ఆ వంకనైనా అందరూ కలుస్తారు అని.అమ్మా నాన్నా కూడా సంతోష పడేవారు పిల్లల్ని వాళ్ల మనవల్ని మనవరాళ్లని చూడటంతో, వాళ్లకి ఆ నాలుగు రోజులు ఆనందంగా గడిచి పోయేవి ఇల్లంతా సందడిగా పండగ వాతావరణంతో;

పిల్లలు అలా అప్పుడప్పుడు పల్లెటూరు చూడటంవల్లా అమ్మానాన్నల్ని కలవడంవల్లా వాళ్ళు కూడా ఆనందంగా గడిపేవాళ్లు ఉన్న నాలుగు రోజులూనూ.

కళ్ళ ముందు తన బాల్యం గుర్తుకొచ్చింది శంకరానికి,వాళ్ళది సగటు మధ్య తరగతి కుటుంబం, బతికి చెడినవాళ్ళు అనేక కారణాలవల్ల!అంత కుటుంబ భారం మోయడం అంటే మామూలు మాటలు కాదు ఆ రోజుల్లో.నాన్న చాలా కష్ట పడేవారు- ఏటికి ఎదురీతలాగా.
కానీ ఎప్పుడు కూడా బాధ పడేవారే కాదు మా ముందు-ఆ విషయంలో!

నాన్న స్నేహితులకి మాత్రం నాన్నంటే అమిత గౌరవం వాళ్ళే అనేవాళ్ళు- ''మీరు పిల్లలురా ఏం తెలుస్తుంది మీకు ఇప్పుడు -మోసే వాడికి తెలుస్తుంది కాడి బరువు" అని ''వాడు చాలా కష్టపడుతున్నాడు.వాడు ''సిరిసంపదలతో'' ఉన్నరోజుల్లో మేము కట్టుబట్టలతో వచ్చాం వేరే ఊళ్ళనుంచి'' అనేవాళ్ళు!

స్కూల్ ఫీజు కట్టాలన్నా కొత్త పుస్తకాలు కొనాలన్నా అన్నిటికి తడుముకోవడమే మరి.కుటుంబం పెద్దది అవడం మూలాన,నాన్న సంపాదన ఒక్కటే ఆధారం అవడం  వల్లా నాన్నా అమ్మా చాలా కష్టపడేవాళ్ళు.

ఒక సారి స్కూల్ నోటీసు బోర్డుపై ఫీజు కట్టని వాళ్ళ పేర్లు వేసి వారంలో ఫీజు కట్టకపోతే స్కూల్ లోంచి తీసేస్తాం అన్నారు; దానితో నాన్నతో ఈ విషయం చెప్పా ఏడుస్తూ ''ఒరేయ్ హెడ్ మాస్టర్ నాకు తెలిసిన ఆయనే,నేను రేపు వచ్చి చెపుతా ఆయనకు,డబ్బులు అటూ ఇటూగా కట్టేస్తా అని, నువ్వేం బెంగ పడకు" అని...

మరునాడు హెడ్ మాస్టర్ నుంచి క్లాస్ లో ఉన్న నాకు కబురు వచ్చింది క్లాసులో పిల్లలు అందరూ- మాష్టారితో సహా చకితులై చూసారు నా వైపు- వీణ్ణి ఎందుకు పిలిచి ఉంటారో అని(హెడ్ మాస్ట ర్గారి దగ్గర్నించి ఎవరికి పిలుపు వచ్చినా క్లాసులో అదే పరిస్థితి ఎప్పుడూను)నేను హెడ్ మాస్టర్ రూమ్ కి వెళ్లాను.హెడ్ మాస్టర్ నుంచి కబురు వచ్చింది అంటే భయమే ఎందుకు పిల్చారో అని.ఆయన రూమ్ లో ''నాన్న''- అన్నట్టుగానే స్కూల్ కి రావడం జరిగింది.

హెడ్ మాస్టర్ నాతో "ఒరేయ్ శంకరం బాగా చదువుకోరా, మీ నాన్న కష్టపడి చదివిస్తున్నాడు, నీకు ఏదైనా అర్థం కాకపోతే నన్నొచ్చి అడుగు, నేను చెపుతా మా ఇంటికి వస్తే" అని అన్నారు. విషయం అర్థమైంది- వాళ్ళిద్దరి లో ఎవరూ ఏది చెప్పకపోయినా- నాన్న మాత్రం నవ్వుతో పలకరింపుగా చూసారు- ''నేను చెప్పాను కదరా'' అన్న భావనతో-
అలాగే అని తలఊపి క్లాస్ కి వెళ్ళిపోయాను.

చిన్నతనంలో ఇంట్లో ఇబ్బందులు అవీ అర్థం అయ్యేవి కాదు తనకి,ప్రతీ దానికి మంకుపట్టు పట్టేవాణ్ని నాకు ఏది కావాలన్నా.అంచేత పండగలప్పుడు కూడా  కొత్తబట్టల కోసం గొడవ చేసేవాణ్ణి. మిగిలినవాళ్ళు తనకంటే పెద్దవాళ్ళు అవడం మూలాన,నేను మధ్య వాణ్ణి అవటం మూలంగానూ నాకంటే చిన్నవాళ్ళు కూడా-సర్దుబాటు చేసుకొని తనకి మాత్రం కొత్త బట్టలు కుట్టించేవాళ్ళు-ఇవి అన్నీ అర్థం చేసుకునే వయసు కాదు నాది మరి-అది తల్చుకున్నప్పుడల్లా ఇప్పుడు చాలా సిగ్గేస్తుంది నాకు .

కొత్త బట్టల్తో నా ఆనందానికి హద్దులు ఉండేవి కావు,అది చూసే ఇంట్లోవాళ్ళు కూడా సంబరపడి పోయేవారు.

వంటలు-పిండి వంటలు మాత్రం లోటు లేకుండా పండగ వరకు బాగా చేసుకునే వాళ్ళం ఇంటిల్లి పాది. మధ్య తరగతి కుటుంబం అవడం వాళ్ళ ఇరుగు పొరుగు కష్ట సుఖాల్లో కాస్త ఒకళ్ళని ఒకళ్ళు ఆదుకునేవాళ్ళు ఇబ్బందులు ఎవరికి వచ్చినా చేదోడు వాదోడుగా.నాకు బాగా గుర్తు మాకు ఉన్నంతలోనే అమ్మ మాత్రం మూడో కంటికి తెలియకుండా లేమితో ఎవరైనా వచ్చినా వాళ్లకి సహాయం చేసేది.

చుట్టు పక్కల ఆడవాళ్లు సాయంత్రానికి మా ఇంటికి వచ్చేవాళ్ళు అమ్మ కాస్తంత పురాణ పఠనం చేసేది వాళ్లకోసం.నాన్న కూడా ధర్మాన్నే నమ్ముకున్న మనిషి, రెండు పూట్లా సంధ్యా వందనం చేసేవారు, దైవ భక్తి మెండు.ఆయన ఉద్యోగం ఆయన గొడవే ఎప్పుడూ,చాలా శ్రద్ధగా చేసేవారు, స్వభావ రీత్యా- అదే జీవనాధారం కూడానాయె.

నా ఆలోచనలకూ అంతరాయం కలిగింది ఫ్లైట్ ఎయిర్ పోర్టుకి చేరడంతో;ఇందిర నన్ను కుదిపింది "ఏంటండీ నిద్ర పోతున్నారా" అని-కాదని తలకాయ ఊపాను.

అక్కణ్ణించి ఓ గంట ప్రయాణం మా వూరికి.ఎయిర్ పోర్ట్ లో టాక్సీ మాట్లాడుకొని ఊరికి బయలుదేరాం. తోబుట్టువులం అందరం చేరాం ఒక్క మా చిన్నతమ్ముడు తప్ప, వాడు వాడి భార్య వాళ్ళ పిల్లల దగ్గరకు కెనడా వెళ్లారు కొన్నాళ్ళు ఉందామని. సమయం తక్కువ అవడం మూలాన వాళ్ళు చేరలేక పోయారు;రాలేక పోయినందుకు చాలా బాధపడ్డాడు నాకు ఫోన్ చేసి.మేం ఇంటికి చేరేసరికి దాదాపు అందరు వచ్చారు, ఒకళ్ళు ఇద్దరు దగ్గర బంధువులు తప్ప.ఆ రోజు ఎలాగూ సూర్యాస్తమయం అయిపోవచ్చింది,అందుచేత కార్యక్రమాలన్నీ మరునాటికి పెట్టుకున్నాం.

చెట్టున మగ్గిన ప్రతీ పండు నేలకి చేరాల్సిందే.అదృష్టవశాత్తు నాన్న వృద్ధాప్యం వరకూ ఆరోగ్యంగా నే ఉన్నారు.వయసు పై పడిన మూలాన వార్ధక్యం రావడం వల్లా ఆయన గుండె మారాం చేసి మూగ పోయింది-ఇంక నేను పని చేయలేనని- నాన్నకు కూడా విశ్రాంతి ఇవ్వాలని కాబోలు బహుశా!

అమ్మ నిర్వికారంగా కూర్చుంది,నేను ఇందిరా అమ్మదగ్గరకి వెళ్ళాం;
పలకరించడానికి బంధువులు కాదుగా-జన్మ ఇచ్చిన అమ్మ,కాస్సేపు మేము మూగవాళ్ళం అయిపోయాం.కాస్త తేరుకున్నాక అమ్మ అంది''వయసు మీద పడ్డా ఒకళ్ళకి ఒకళ్ళం తోడుగా ఉన్నాం రా శంకరం,తోడు తోడే- ఆయన పడుకునే మంచం ఇక నుంచి ఎప్పుడూ ఖాళీగా ఉంటుంది-అదే ఖాళీ నాలోపల కూడాను నేబతికినన్నాళ్ళూ"అని ఉండబట్టలేక ఏడ్చేసింది.

ఆ రోజు రాత్రి తోబుట్టువులందరికీ ఇందిరే చెప్పింది తన కోరికని,నిర్ణయాన్ని;

ఇల్లు వాకిలీ వూళ్ళో తెలిసిన బంధువులకి అప్పచెప్పాము చూసుకుంటూ ఉండమని,తర్వాత మళ్ళీ మాలో ఎవరో ఒకళ్ళం వస్తామని చెప్పాము.
కార్యక్రమాలు అన్నీ అయినతరువాత అమ్మని తీసుకుని మా వూరు ప్రయాణం అయ్యాం.
మిగతా వాళ్లంతా ఎవరి ఊళ్ళకి వాళ్లకు ప్రయాణం అయ్యారు.

మేము ఇంటికి చేరిన తర్వాత అమ్మ ఒక మాట అంది మా ఇద్దరితో ''పండుటాకులు ఎప్పుడైనా నేలకి రాల వలసిందే, రెక్కలొచ్చిన పక్షి ఎగరవలసిందే'' ''చివర వరకు మీ నాన్నకు తోడుగా ఉండగలిగాను, నా వరకూ వచ్చే సరికీ నా అందరు పిల్లలూ పోటీ పడ్డారు నన్ను తీసుకెళ్ల టానికి వాళ్ళతో,అంతకంటే కావాల్సింది ఏముందిరా, ఈ వయసులో ; కానీ నా బెంగల్లా మీ పిల్లలిద్దరూ వేరే దేశాలకి వెళ్లి పోయారు, మీరు ఒంటరి అయితే మిమ్మల్ని ఎవరు చూస్తార్రా. ఎప్పటికయినా మీరు మీ పిల్లల దగ్గరకి వెళ్లిపోండి నా తదనంతరం''అని!

అప్పుడు అమ్మతో అన్నా"నిన్నూనాన్ననీ వదిలేసి మేమంతా ఎగిరిపోలా;అలాగే మా పిల్లలూ, అప్పటికీ ఇప్పటికీ తేడా ఏముందమ్మా,ఎవరి జీవితాలు వాళ్ళవి కాదా,ఆ...కాకపోతే ఒక తేడా ఉండొచ్చు, మాతరం ఈ దేశంలో తర్వాత తరం విదేశాల్లో అంతే" అన్నా నవ్వుతూ-అమ్మ వేదాంతిలా నవ్వేసి ఊరుకుంది.

నాన్న పోయిన ఐదు ఏళ్ళకి అమ్మకూడా మా గృహం నుంచి,ఈగ్రహం నుంచే శాశ్వతంగా వెళ్లి పోయింది.అమ్మ పోయికూడా ఇప్పటికి ఐదేళ్లు అయింది.ఇప్పటికీ అమ్మ చెప్పిన మాటలే (''పండుటాకులు ఎప్పుడైనా నేలకి రాలవలసిందే, రెక్కలొచ్చిన పక్షి ఎగరవలసిందే'') చెవుల్లో రింగుమంటూ ఉంటాయి.మా వృద్ధాప్యం గురించి ఏమాత్రం బెంగలేకుండా భగవంతుడి మీద భారంవేసి రోజులు వెళ్లబుచ్చుతున్నాం -నారు పోసినవాడు నీరు పోయకుండా ఉండడు కదా!!

మానవ జీవన పరిణామంలో జరిగే మార్పులకు సిద్ధపడ్డ మాలాంటి దంపతులకి కొదవే లేదు మన దేశంలో ఇప్పుడు- అలాంటప్పుడు ఇది సమస్య ఎలా అవుతుంది- నిత్యం సమాజంలో జరిగే సహజమైన మార్పు- అంతే గాని- దీన్నివేరే రకంగా తీసుకోవాల్సిన అవసరం లేదు, అగత్యం అంతకన్నా లేదు.ఇంచుమించుగా అందరికీ ఇదే ''జీవిత చక్రం'' పుట్టిన ప్రతీ మనిషికి చివరి అంకం చేరేవరకూ- అదే సృష్టి ధర్మం! ఉన్నంతవరకూ, ఉన్నంతలో,

హాయిగా సంతోషంగా బతికేస్తున్నాం
- నేను ఇందిరానూ!

# పండు - రావిచెట్టు!!

వచ్చే ఖాతాదారుల మాటలు
"పండు" ఎప్పటిలాగే బూట్ పోలిష్ సరంజామా పెట్టుకొని రావిచెట్టుకింద కూర్చున్నాడు. వాడు ఒక అనాథ -పేరు ఎవరు పెట్టారోగానీ అదృష్టవంతుడు కనీసం ఆ మంచిపేరుతో పిలుస్తున్నారు అందరూ. లేకపోతే బూట్ పాలిష్ చేసే కుర్రాణ్ణి ప్రజలు ఎలా సంభోదిస్తారో మనందరం చూస్తూనే ఉన్నాం దైనందిన జీవితంలో-అందులో పండు అనాథ కూడా.

పండు ఎప్పుడూ నవ్వుతూ హుషారుగా కబుర్లు చెప్తూ ఉంటాడు కస్టమర్లతో- పాలిష్ చేస్తూ కూడా. వచ్చేవాళ్లలో కొంతమంది వాడికి కొంత ఎక్కువ డబ్బే ముట్ట చెపుతారు-వాడి వైఖరి (ఆటిట్యూడ్) నచ్చి,కొంతమంది పెద్దవాళ్ళు మాత్రం ఆప్యాయంగా "ఒరే పండుగా" అని పిలుస్తారు-వాడు కూడా అంత ఆనందంగానే ఉంటాడు అందరితో.

ఆ రావిచెట్టే వాడి సామ్రాజ్యం,వచ్చే మనుషులే వాడి బంధువులు;పాలిష్ సరంజామా అంతా వాడి కుటుంబ సభ్యులు, అవన్నీ కూడా వాడు చెప్పిన మాట వింటూ వాడి కబుర్లలో మమేకమైపోతాయి ప్రతీరోజూ. అవి కూడా రోజూ ఎదురు చూస్తుంటాయి వాడి రాకకోసం, డబ్బాలోంచి పండు చేతుల్తో ఎప్పుడు తమని బయటకి తీస్తాడా అని, వాటన్నంటిని వాడి చేతులతో ఎప్పుడు తాకుతాడా అని- వాటికి మాత్రం ఎవరున్నారు -లాలనగా, ఆప్యాయంగా తల నిమరటానికి ప్రతినిత్యం- పండు తప్ప!

ఇలాంటి వాళ్లందరికి వండిపెట్టే (డబ్బులకే) ఓ పూటకూళ్ళమ్మ-యాదమ్మ- ఉంటుంది ఆ ప్రాంతంలో.ఆమె కూడా తన జీవనాధారం వంటే అవడంతో- చాలా తక్కువ డబ్బుకే ఇలాంటి పిల్లలందరికీ భోజనం అమ్ముతూ ఉంటుంది- లాభాపేక్ష లేకుండా.అదృష్టంలో అదృష్టం ఏమిటంటే ఈ పండుగాడు ఆ యాదమ్మ ఇంట్లోని వసారాలో పడుకుంటాడు- అక్కడే నిద్రా బసానూ.

వాడికి చదువుమీద ఉండే ఆపేక్షవల్ల రాత్రిపూట ఆ యాదమ్మదగ్గరే నాలుగు అక్షరాలూ, చదవడం రాయడం నేర్చుకున్నాడు (యాదమ్మవానాకాలం చదువు చదవడం వల్ల కొద్దో గొప్పో చదవడం రాయడం,నాలుగు మంచి మాటలు చెప్పడం నేర్చుకుంది)

పండు ఇంగ్లీష్ రాయడం చదవడం కూడా నేర్చుకున్నాడు- తన దగ్గరకి వచ్చే ఖాతాదారుల మాటలు జాగ్రత్తగా వింటూ అవి పట్టేసేవాడు.

ఆ వచ్చే ఖాతాదారుల్లోనే ఒకళ్ళిద్దరు వాడి ఆసక్తి చూసి ఆంగ్లం నేర్చుకునే పుస్తకాలు అవీ ఇచ్చే వారు (లోకంలో ఇంకా మంచితనం ఉందిగా కలియుగమైనా-డిజిటల్ జనమైనా)రాత్రి సమయం వృథా చేయకుండా రాయడం చదవడం నేర్చుకున్నాడు.కానీ ఎప్పుడూ ఎవరి దగ్గరా బయట పడేవాడు కాదు-తనకు ఆంగ్లం కూడా వచ్చని.

వాడు పనిచేసే రావిచెట్టు ప్రాంతంలోనే పాత పుస్తకాలు అమ్మేవాళ్ళు ఉన్నారు, వాళ్ళతో మంచిగా ఉంటంవల్ల వాళ్ళదగ్గర నుంచి ఒక్కో పుస్తకం తెచ్చుకొని రాత్రి పూట చదివేవాడు-దానితో వాడికి లోకజ్ఞానం బాగా అబ్బింది.ఆ దెబ్బతో వాడికి

ఆత్మ స్థైర్యం తన మీద నమ్మకం బాగా పెరుగుతున్నాయి రోజులు గడిచిన కొద్దీ! కాకపోతే వాడికి కూడా జీవితాంతం బూట్ పాలిష్ చేసుకొని బతకాలని లేదు, భవిష్యత్తు మీద ఆశ బాగా ఉంది, వాడిమీద వాడికున్న నమ్మకంతో పాటు!

ఒక రోజు-రోజూలాగానే వాడి దినచర్య మొదలైంది, ఒక కుర్రాడు బూట్ పాలిష్ చేయించుకుని డబ్బులిచ్చి వెళ్ళిపోయాడు.పండు కూడా ఇంకో కస్టమర్ షూ పాలిష్ చేస్తున్నాడు.అప్పుడు గమనించాడు ఒక ఫైల్ వాడి పక్కన ఉండటం.

వాడికి గుర్తుకొచ్చింది అది అంతకు ముందు వచ్చిన కుర్రాడి చేతిలో చూసినట్టు, వెంటనే ఫైల్ తెరచి చూస్తే అన్నీ సర్టిఫికెట్స్.అదృష్ట వశాత్తు అక్కడ ఆ కుర్రాడి పేరు (సూర్యం) ఫోన్ నెంబర్ ఉండటంతో అక్కడ కస్టమర్ ఫోన్ తీసుకుని ఆ కుర్రాడికి ఫోన్ చేసాడు. సూర్యానికి అప్పటి దాకా స్పృహే లేదు చేతులో ఉండాల్సిన రెండో ఫైల్ సంగతి- అది చేతిలో లేదని.

అప్పుడు చాలా కంగారు, ఆందోళనకి గురి అయ్యాడు-ఎందుకంటే అతను వుద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్తున్నాడు.వెనక్కి వచ్చి,పండుకి కృతజ్ఞతలు చెప్పి వాణ్ని కావులించుకుని కళ్ళనీళ్ల పర్యంతం అయ్యాడు.

''నువ్వు ఫోన్ చేయకపోతే ఇంటర్వ్యూ కి అలాగే వెళ్లిపోయేవాణ్నిఈ సర్టిఫికెట్స్ లేకుండానే- అప్పుడు నా పరిస్థితి ఏమిటి''అని పండుతో అన్నాడు

“అన్నా నీకు మంచి జరుగుతుంది కాబట్టే సర్టిఫికెట్స్ నాకళ్ళపడ్డాయి సమయానికి నువ్వు రాగలిగావు” అన్నాడు అప్పటినుంచి సూర్యానికి ఎందుకో పండు అంటే ఒక రకమైన అభిమానం కలిగింది తరచూ కలుస్తూ ఉండేవాడు కూడా.ఎందుకో పండులో ప్రతిభ అలా రావిచెట్టుకింద బూట్ పోలిష్ తో అంతం కాకూడదు తాను సహాయంచేసి వాణ్ణి చదివించాలి అని నిశ్చయించుకున్నాడు.

దానికి రెండు కారణాలు-ఒకటి తానూ చాలా కష్టపడి చదువుకున్నాడు-వేరొకళ్ళకి సహాయం చేసే అవకాశం భగవంతుడు ఇచ్చాడు ఇప్పుడు.రెండవ కారణం ఆ రోజు పండు సర్టిఫికెట్స్ ఫైల్ ఇవ్వకపోతే తన జీవితం ఏమై పోయిండోదే అని తలచుకుంటేనే భయం వేస్తుంది, భగవంతుడు వాడి రూపేణా తనకు సాయం చేసాడు “దైవం మానుష రూపేణా” అంటారు కదా!

అందుచేత పండుని కూడా జీవితంలో పైకి తీసుకెళ్ళాలి,వాడి జీవితం రావిచెట్టు కింద ఒక అనాధగా, బూట్ పాలిష్ తో  తెల్లారకూడదు అని అనుకున్నాడు.

ఒక రోజు పండుతో "పండూ నువ్వు ఎన్నాళ్ళు ఇలా పనిచేస్తావు, చదువుకొని, నాలాగా ఉద్యోగం చేయాలనే కోరిక లేదా, ఇకనుంచి ఈ పని మానెయ్,నాకూ ఎవరూ లేరు ఈ నగరంలో; మా అమ్మా-నాన్నా మా పల్లెలో ఉన్న కొద్ది పొలంలో వ్యవసాయం చేసుకు బతుకుతున్నారు.నువ్వు నాతో బాటే ఉండు,నేను చదివిస్తా” అన్నాడు సూర్యం.

పండుకి ఎగిరి గంతు వేయాలనిపించింది మనసులో- కానీ తన ఉత్సాహాన్ని మనసులోనే అదుపు చేసుకొని-

"వద్దులే అన్నా, నాకీ పని బానే ఉందిగా- బతకడానికి ఇబ్బంది లేదు,నాకెవరూ లేరు అని అసలు అనిపించదు,నా దగ్గరకు వచ్చేవాళ్ళు అందరూ ప్రేమగా ఆప్యాయంగా చూస్తారు, వీళ్లందరినీ వదులుకోలేను" అన్నాడు.

ఎవరో కొత్త వ్యక్తి అడగంగానే తను తలకాయ ఎలా ఊపుతాడు-పైగా సూర్యానికి తను చేసిన మేలు ఏమీలేదు, అతనికి భారం అవడం ఇష్టం లేదు ఆ ఫైల్ ఎవరికీ కనపడినా ఇచ్చేవాళ్ళు- దానిలో తను చేసిన గొప్పేమీ లేదే అని మనసులో అనుకున్నాడు.

సూర్యం వాణ్ని అడగగానే పండు కళ్ళలో క్షణకాలం మెరుపు మెరవడం సూర్యం దృష్టినుంచి తప్పించుకోలేదు. సూర్యం ఎంత బతిమాలినా పండు వినలేదు,అప్పటికి సూర్యం ఇంకా ఒత్తిడి చెయ్యలేదు.మనసులో మాత్రం సూర్యానికి నమ్మకం ఏర్పడింది ఏదో ఒక రోజున పండుని ఒప్పించగలనని- మనసులోనే ఓపధకం రూపుదిద్దుకుంది.

రోజులు గడుస్తున్నాయి-సూర్యం కూడా కొత్త ఉద్యోగంలో తీరక లేకుండా అయి పోయాడు, ఉద్యోగంలో కష్టపడి పనిచేస్తుండటం, కొత్త విషయాలు అట్టే పట్టేయడం వల్ల ఆఫీసులో అందరికీ ఇష్టమైనవ్యక్తిగా మారిపోయాడు.అయినా తీరిక దొరికినప్పుడల్లా పండుని కలిసి పలకరించి వస్తున్నాడు.పండుకి పుస్తకాలు చదివే అలవాటు ఉండటం వల్ల- కొన్ని మంచిపుస్తకాలు కొత్తవి కొని ఇస్తున్నాడు -ఆంగ్ల పుస్తకాలు కూడా-అప్పుడప్పుడు- వాటిల్లో గొప్ప వాళ్ళ ఆత్మ కధలు(స్వీయ చరిత్ర)( ఆటోబయోగ్రఫీ) కూడా ఉండేవి.

తన ఫైల్ మీద పేరు చదివి పండు ఫోన్ చేసిన సంఘటన సూర్యానికి గుర్తుంది.తన పేరులో ఆంగ్లంలో ఉంది.అది తనకు గుర్తుంది కాబట్టే వాడికి ఆంగ్ల పుస్తకాలు కూడా ఇవ్వడం మొదలు పెట్టాడు- వాణ్ని చదివించే పధకంలో నాందీ ప్రస్తావనగా.

క్రమేపీ పండులో ఆత్మవిశ్వాసం పెరిగింది, తాను కూడా చదివి పైకి రావాలనే భావం రోజురోజుకీ పెరిగిపోయింది;కానీ సూర్యం అన్నని అడగటానికి మొహమాటం, సిగ్గూ అడ్డం వచ్చేవి.

ఎప్పుడైతే పండు తాను ఇచ్చిన పుస్తకాలు ఆసక్తిగా చదువుతున్నాడో- సూర్యానికి అర్ధమైంది.పండు దగ్గర మళ్ళీ చదువు విషయం కదిపే సమయం వచ్చిందని.వాణ్ని ఇన్నాళ్లు పరిశీలన చేసినప్పుడు కూడా అర్ధమైంది పండు చాలా స్వాభిమానం కలవాడని-అందుకే సూర్యం పండు దగ్గర చదువు గురించి కదిపాడు మళ్ళీ!

ఈసారి పండు మొహమాట పడుతూనే, చదువుకి ఒప్పుకున్నాడు- కానీ అలా అని ఇన్నాళ్లు తనకు అన్నం పెట్టిన పనిని వదిలి పూర్తిగా ఎవరి మీదో ఆధారపడటం ఇష్టం లేకపోయింది-సూర్యంతో తన మనసులో మాట చెప్పాడు.

దానికి సూర్యం "ఇలా నువ్వు ఈ పని చేస్తూ చదువు సాగించడం కష్టం- అదీ కాకుండా నీకు స్కూల్ నేపధ్యం లేదు కాబట్టి- ఏడాదిపాటు చదివించి స్కూల్ లో ప్రవేశ పరీక్ష రాయించి చేర్పించాలి, అందుకని నా దగ్గరకు వచ్చేయి" అన్నాడు.

“అన్నా నీకు పూర్తిగా భారం అవడం నాకు ఇష్టం లేదు,అదీ కాకుండా ఇంతమంది ఆత్మీయత కోల్పోతాను”అన్నాడు.

దానికి సూర్యం “దానిదేముంది,కష్టపడి చదువుకుంటూ నువ్వు పైకి వచ్చిన తర్వాత ఇదే చోటుకు రా- నీకంటే వాళ్ళు ఎక్కువ సంతోషిస్తారు ప్రయోజకుడవై నందుకు” అన్నాడు. పండుకు తానూ పైకి రావాలనే బలమైన కోరిక ఉండటం వల్ల కూడా ఇంక ఏ మాత్రం కాదనలేకపోయాడు
“సరే అన్నా రేపు మాత్రం చివరిసారిగా ఇక్కడకు వచ్చి పనిచేసి అందరికీ చెప్పి వెళ్తాను, ఇలా ఒక్క సారే నేను కనపడకుండా వెళ్ళిపోతే వాళ్లంతా నాగురించి అనుకుంటారు, నాకు కూడా వాళ్ళని కలవాలనిఉంది కొంతమందినైనా” అన్నాడు పండు.

దానికి సూర్యం నవ్వుతూ,పండు తలనిమిరుతూ “తప్పకుండా అలా చెయ్యి”
అని మనసులోనే మెచ్చుకున్నాడు వాణ్ని.

పండు యాదమ్మ దగ్గరకు సూర్యంని తీసుకెళ్లి విషయం చెప్పాడు,యాదమ్మ చాలా సంతోషించింది. సూర్యంతో అంది,“బాబూ నిన్ను దేవుడు చల్లగా చూస్తాడు ఇంత మంచిపని చేస్తున్నందుకు- అయినా నిన్నుదేవుడే పంపించివుంటాడులే వీడి కోసం,ఇవి ఎవరికివారే యమునా తీరుగా ఉంటున్న రోజులు, ఎవరయ్యా ఇలా చేయగలరు-అదీ కాకుండా ఓ అనాధని ”అని సూర్యాన్ని మెచ్చుకుంది.

అలాగే పండుతో అంది-“ఒరేయ్ అప్పుడప్పుడు ఈ ముసలిదాన్ని చూడటానికి వస్తూ ఉండూ” అంది కళ్ళ నీళ్లు పెట్టుకుని- పండు యాదమ్మని కౌగలించుకుని “నాకు అమ్మా-నాన్న నువ్వేనమ్మా ఇంకెవరున్నారు” అని.

పండు వాడి సామాను సర్దుతున్నప్పుడు సూర్యం యాదమ్మని అడిగాడు కుతూహలంగా....

"పండు నీ దగ్గరకి ఎలా వచ్చాడు"
దానికి సమాధానంగా యాదమ్మ- - -.

"ఇక్కడకి దగ్గరలోనే ఓ అనాధఆశ్రమం ఉంది బాబూ, ఎక్కువగా నాదగ్గర భోజనానికి చిన్నపిల్లలే వస్తుంటారు- ఏవో చిన్న పనులు- కూలి నాలి చేసుకుని.నేనా ఏకాకిని, ఇల్లు ఉంది-అందుకని వాళ్లకి భోజనం పెట్టి తృప్తి పడతాను- నాకూ ఇదే ఉపాధి-ఉచితంగా ఇవ్వలేను, అందుకని నాకు ఖర్చు అయ్యేదాన్ని బట్టి వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకుంటా” అన్నది.

''అప్పుడప్పుడు అనాథ ఆశ్రమానికి వెళ్లడం నాకు అలవాటు-నాకు వేరే వ్యాపకం లేదుగా- కాసేపు పిల్లలతో సమయం గడిపి వస్తాను.అప్పుడు పండు నన్ను ఆకర్షించాడు వాడి చురుకుదనంతో - అక్కడ అధికారులతో మాట్లాడి వాడిని నాదగ్గరకు తెచ్చాను- గాలివాటంలా తిరుగుతాడేమో అని నేనే బూట్ పోలిష్ సామాను కొనిఇచ్చా''!

ఆ రావిచెట్టు దగ్గర చాలా ఆఫీస్ లు,కాలేజీలు ఉండటంవల్ల వాడు అక్కడ కూర్చుంటాడు; రాత్రికల్లా ఇక్కడకు వచ్చేస్తాడు ఇక్కడే బస, నిద్ర అన్నీను.

సంపాదిస్తున్నాడు కాబట్టి, వద్దన్నా డబ్బులు ఇస్తాడు,మిగిలిన డబ్బులు దాచుకోవడం కూడా నాదగ్గరే- నాకు ఎవరు ఉన్నారు అమ్మాఅంటాడు. వాడు చక్కటి తెలివితేటలు ఉన్న పిల్లాడు, చెడు అలవాట్లు ఏమీలేవు కూడా- ఏదైనా డబ్బున్న మారాజు ఇంట్లో పుట్టిఉంటే చాలా పైకివచ్చేవాడు''-
అని యాదమ్మ నిట్టూర్చింది!

''నువ్వు మాత్రం ఎవరూ చేయని పని చేస్తున్నావు బాబు,వాడు భవిష్యత్తులో చాలా ఎదగగలడు-తోడు, సహాయం ఉంటే.వాడి అదృష్టం, నీ దయ వల్ల భగవంతుడు నీ రూపంలో వచ్చాడు వాడికోసం'' అంది.

''వాడి తాలూకు వివరాలు ఏమైనా కావాలంటే వాళ్ళ దగ్గర ఉంటాయి,నాకేమీ అవి ఉపయోగంలేదు కాబట్టి నేను అడగలా అంది''!

అక్కడ తనకు ఉన్న కొద్దీ సరంజామా-బూట్ పాలిష్ సామానుతోసహా తీసుకుని యాదమ్మ ఆశీర్వాదం తీసుకుని సూర్యం ఇంటికి బయలు దేరాడు!

సూర్యం కూడా యాదమ్మ దగ్గర సెలవు తీసుకునేముందు ''వీలు చిక్కినప్పుడు కనపడతుంటానమ్మా'' అని యాదమ్మతో అన్నాడు!

ఆ అడుగు తాను ఊహించని జీవితానికి నుడికారం చుడుతుందని పండుకి గాని- తాను చేసే ఈ సాయం పండు జీవితాన్నిమారుస్తుందని, తన జీవితం కూడా అద్భుతంగా ఉంటుందని- సూర్యానికి గాని ఊహకు అందని విషయం.

రావి చెట్టు మీద త్రిమూర్తులు ఉంటారని గాని,వాళ్ళు పండుగాణ్ణి ఆశీర్వదిస్తున్నారని గాని ఎవరికీ తెలియని మరో విషయం! మన పురాణాల ప్రకారం-బ్రహ్మ రావి చెట్టు వేళ్ళలోనూ, మహా విష్ణువు చెట్టు బోదెలోనూ, పరమశివుడు చెట్ల ఆకుల్లోనూ ఉంటారని నమ్మకం!

పండు తన సరంజామాతో సూర్య ఇంటికి మకాం మార్చేశాడు, సూర్యం పండుకి ఒక గది కేటాయించాడు- పండు ఆ గదిలో ఉన్న మంచం, బల్ల, కుర్చీ, పుస్తకాల అల్మైరా  అన్నీ అమర్చివుండటంతో ఆశ్చర్య పోయాడు.

"అన్నా- ఇవన్నీ" అని పండు అనే లోపే సూర్యం "నువ్వు ఏదో రోజు వస్తావని నమ్మకం ఉండటంతో అన్ని ఏర్పాట్లు ముందే చేసాను" అన్నాడు పండు ఆనందంతో కళ్ళ నీళ్లు కారుస్తూ "అన్నా నేను నీకు ఏం అవుతానని ఇంత సాయం చేస్తున్నావు, నేను ఒక అనాధని" అని అన్నాడు!

"నువ్వు అనాధవి ఎలా అవుతావు, ప్రతీరోజూ నీదగ్గరకు వచ్చేవాళ్లలో చాలామంది ఆప్యాయంగా చూసేవాళ్ళు, నీ కడుపు చూసుకోవటానికి, నీ తలకి గూడు ఇవ్వటానికి యాదమ్మ ఉంది, ఇప్పుడు నేను ఉన్నాను.ఈ రోజు నుండి నువ్వు అనాధవి అనే భావనని నీ మనసులోంచి చెరిపేయి" అన్నాడు సూర్యం.

పండు మౌనంగానే తలవూపాడు, ఆనందంతో మాటలు రాక- ఇది తాను కలలో ఊహించుకోవడానికి కూడా సాహసం చేయలేనిది! తన సామాను అంతా ఆ గదిలో సర్దేసుకున్నాడు,ఇద్దరూ నిద్రకి ఉపక్రమించారు-  ఈరోజు ఇద్దరూ యాదమ్మ ఇంట్లో భోజనంచేసి రావడంతో!

సూర్యం ఈలోపే పండు చదువు గురించి, అన్నీ వాకబు చేసి ఉంచాడు; ఒక ఏడాది  చదివితే పదవ తరగతి ప్రైవేట్ గా వ్యక్తిగతంగా  రాయొచ్చు అని, దానికి వాడికి శిక్షణ ఇచ్చే ఒక శిక్షణాలయంలో మాట్లాడి ఉంచాడు.

మరునాడు పండు సూర్యానికి చెప్పినట్టుగా తన పాలిష్ సరంజామాతో బయలు దేరాడు; అది చూసి సూర్యం "అదేంటి పండు మళ్ళీ'', అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ (వాడు చెప్పింది గుర్తు ఉన్నా)

అందుకు పండు''లేదన్నా ఈ రోజు చివరసారిగా ఆ రావి చెట్టు కింద కూచ్చోని పని చేస్తాను నా తృప్తికోసం''అన్నాడు,సూర్యం పండుని మెచ్చుకోలుగా చూసాడు.

పండు తన మాటలు కొనసాగిస్తూ_ _ _ "వచ్చిన వాళ్లందరికీ చెప్తాను ఇక పని చేయట్లేదని,నువ్వు నన్ను చేరదీసి చదివిస్తున్నావని చెప్తాను" అన్నాడు.సూర్యం అలాగే అని చెప్పి తాను ఆఫీస్ కి వెళ్లి పోయాడు-ఇంటి తాళం చెవి ఒకటి పండుకి ఇచ్చి.

పండు యధాప్రకారం రావిచెట్టుకిందకి చేరి తన బూట్ పాలిష్ డబ్బాలో ఉన్న ఒక్కొక్క  సామానుని ఆప్యాయంగా తాకాడు-అవి నోటితో చెప్పలేకపోయినా వాడి మనసులో భావాల్ని అర్ధం చేసుకుని అవి కూడా భావోద్వేగానికి గురిఅయ్యాయి- ఇది అతిశయోక్తిగా అనిపించవచ్చు కానీ పండుమాత్రం వాటి భావాలు తనకు తెలిసినట్టుగా కొద్దిగా ఉద్వేగానికి లోనయ్యాడు.

పండు ఒక బోర్డు తయారు చేసి పెట్టాడు జనం వచ్చేలోపే- తన పక్కనే-అందరికీ కనపడేట్టుగా.....

"ఈ రోజుతో నా ఈ బూట్ పాలిష్ పనికి ఆఖరిరోజు"అని!

అది చూసినవాళ్ళు అడగటం మొదలు పెట్టారు-కొత్తగా వచ్చినవాళ్లకి పరిచయం లేదు కాబట్టి-కొంతమంది అడిగారు, మరికొంతమంది అడగనూ లేదు. పండుకి బాగా పరిచయం ఉన్నవాళ్ళు మాత్రం విషయం తెలిసి సంతోషించినా పండు రోజూ కనపడడూ అనే ఆలోచనకే బాధపడిపోయారు.ఇన్నేళ్ళుగా పండు అందరికీ అలవాటు అయ్యాడు- ఒక ఆత్మీయుడుగా మారిపోయాడు.కొంతమంది అయితే వాళ్ళ రోజువారి దినచర్యలో వాడి దగ్గర ఆగి పలకరించడం దాకా చేసే వాళ్ళూ ఉన్నారు.

ఒకళ్ళు ఇద్దరు వాడి అడ్రస్,సూర్యం ఫోన్ నెంబర్ తీసుకున్నారు,కొందరైతే వీలు కుదిరినప్పుడు ఇటువైపు వచ్చిపోతూ ఉండమన్నారు.ఇక పండు దగ్గర అలవాటుపడ్డవాళ్ళు రేపటి నుంచి వేరే బూట్ పాలిష్ చేసేచోటుకి వెళ్ళాలి అని అనుకున్నారు.

ఇద్దరు, ముగ్గురు మాత్రం, సాయంత్రం వాళ్ళు ఇళ్ళకి వెళ్లేసమయానికి పండు దగ్గరకి వచ్చి,స్వీట్ బాక్స్,పెన్ ఇచ్చి- వాడికి శుభాకాంక్షలు చెప్పి జాగ్రత్తగా చదువుకొని వృద్ధిలోకిరా అని వాళ్ళ దీవెనలు కూడా ఇచ్చారు- లోకంలో మంచితనం లేదని ఎవరన్నారు!

పండుకి మాత్రం దుఃఖం ఆగలా వాళ్ళ ప్రేమని చూసి-ఏడ్చేశాడు కరువుతీరా: చుట్టుపక్కల పుస్తకాల దుకాణాల వాళ్ళు,టీ షాప్ వాళ్లకి కూడా పండు విషయం తెలిసి, వాళ్ళుకూడా పండు దగ్గరకి వచ్చి మెచ్చుకున్నారు-అందరికీ కృతజ్ఞతలతో నమస్కారం చేసాడు.

సాయంత్రం అయ్యేటప్పటికల్లా తన సరంజామా అంతా డబ్బాలో వేసుకొని తనకి బతుకు తెరువునిచ్చిన ఆ ‘‘స్థలానికి-రావి చెట్టుకి’’ దండం పెట్టి భారమైన హృదయంతో ఇంటికి బయలుదేరాడు-సరికొత్త జీవితంలోకి!

ఇక మరునాడునుంచి వాడికి చదువు మొదలయింది-పొద్దున్నే కోచింగ్ సెంటర్ కి వెళ్లడం-సాయంత్రం రావడం.కాస్త విశ్రాంతి తర్వాత సూర్యం ఇంటికి వచ్చేవేళ అయ్యేది,కాస్త కబుర్లు చెప్తూ వంటకానిచ్చేవారు. పండుకి చదువులో ఏమైనా అనుమానాలు అవీ ఉంటే సూర్యం దగ్గర నివృత్తి చేసుకునేవాడు. భోజనాలు అయిన తర్వాత పండు తన చదువులో పడిపోయేవాడు.

సూర్యం అప్పుడప్పుడు తన ఆఫీస్ ఫ్రెండ్స్ తో బయటకు వెళ్తూ ఉండేవాడు సెలవరోజుల్లో.నెలకో రెణ్ణెల్లకో పండూ, సూర్యంతో-అదీ బలవంతం మీద బయటకు వెళ్లడం కానీ, సినిమాకో, హోటల్ కో వెళ్ళేవాడు.

సూర్యం రెండు మూడు నెలలకి ఒకసారి తన పల్లెకు వెళ్ళేవాడు-అమ్మానాన్నల దగ్గరకు.ఒక సారి పండుని కూడా అక్కడకు తీసుకెళ్లాడు,సూర్యం తల్లి తండ్రులు వాణ్నిచూసి సంబరపడిపోయారు- వాడు కూడా తమ కొడుకు లాగానే అనుకున్నారు-తమ కొడుకు సూర్యం చేసిన పనికి చాలా మెచ్చుకున్నారు, సంతోషించారు కూడా.

పండుకి మాత్రం తనకు జరిగేది అంతా కలా నిజమా అని అనుకునేవాడు.ఏ మాత్రం తన జీవితంలో ఊహించనిది, తనకూ ఒక కుటుంబం దొరుకుతుందని, తన అదృష్టానికి మనసులో దేవుడికి ఎప్పుడూ దండం పెట్టుకుంటూనే ఉండేవాడు.

తాను ఎంత చదువులోఉన్నా వీలుచిక్కినప్పుడు యాదమ్మనిపలకరించి వచ్చేవాడు, అలాగే రావిచెట్టు దగ్గరకు కూడా.ఎప్పుడైనా తెలిసినవాళ్ళు అక్కడ కనపడి పలకరించేవాళ్ళు పండుని. వీడు చదువుకుంటున్నాడని తెలుసుకాబట్టి పాతపుస్తకాల షాపుల వాళ్ళు పండుకి ఏవైనా పుస్తకాలు కావాలంటే ఇస్తూ ఉండేవాళ్ళు.అలా పాతచోటుకి వెళ్తూ  తెలిసిన మనుషుల్ని కలుస్తూ చదువుకుంటూ ఉండేవాడు.

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి- అనుకునే లోపే పరీక్షలు రానే వచ్చాయి, పండు పరీక్షలు బాగా రాసాడు.ఫలితాలు రావటానికి ఇంకా సమయం పడుతుంది కాబట్టి సమయం వృధా చేయడం ఇష్టం లేక చిన్న చిన్న కోర్సుల్లో, పర్సనాలిటీ డెవలప్మెంట్ క్లాసులకి వెళ్ళేవాడు.ఆ వయసులో కుర్రాళ్ళకి ఉండే ఆకర్షణలు పండుకి లేవు- తాను పెరిగిన నేపథ్యం వల్ల కావచ్చు- పూర్వజన్మ సుకృతం అంటే ఇదేనేమో!

పరీక్షా ఫలితాలు రానే వచ్చాయి-పండు తాను అనుకున్నట్టే,సూర్యానికి ఉన్న అంచనాల లాగే డిస్టింక్షన్ లో టెన్త్ పాస్ అయ్యాడు.

ఆ దెబ్బతో వాడికి ఇంటర్మీడియట్ లో సీట్ ఉచితంగా దొరికింది.సూర్యం ఎప్పుడూ పండుతో అంటూ ఉండేవాడు, ‘‘నువ్వు చాలా తెలివి, కసి ఉన్నవాడివిరా, నాలా ఏదో ఉద్యోగం కాదు, నాకంటే ఇంకా పైకి చదివి బాగా ఎదగాలి’’ అని -పండుకి మాత్రం కళ్ళవెంట నీళ్లు వచ్చేవి- సూర్యం అన్న చూపిస్తున్న ప్రేమకి, ఆదరణకు, ప్రోత్సాహానికి.

అలా చూస్తూ చూస్తూ ఉండగానే ఇంటర్మీడియట్ తో బాటు,ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ కూడా రాసాడు. వాడికున్న తెలివితేటలకు పెద్దగా కష్టపడకుండానే వెయ్యి రాంకుల లోపే సాధించాడు.దానితో వాడికి నగరంలో ఉన్న పేరున్న కాలేజీలో ప్రవేశం దొరికింది.

ఇటు సూర్యానికి తన ఆఫీస్ లో ప్రమోషన్ కూడా వచ్చింది-ఆఫీస్ సహోద్యోగులతో కూడా కలిసిమెలిసి ఉండేవాడు.పండుని తన దగ్గర ఉంచుకుని చదివించడం, ఆ విషయాలు తెలియడం వల్ల ఆఫీస్ లో వాళ్ళకి కూడా సూర్యం అంటే ఒక ప్రత్యేక గౌరవం అభిమానం ఉండేది.అతని వ్యక్తిత్వం నచ్చి సూర్యం ఆఫీస్ లో పనిచేసే  లలిత అతనంటే ఇష్ట పడేది రెండు ఏళ్లనుంచి.

తన మనసులో ఉన్నమాటని మొదటిసారిగా సూర్యంతో చెప్పింది ఒక రోజు ‘‘నీకు ఇష్టమైతే మనం పెళ్లి చేసుకుందాం’’ అని!

సూర్యానికి అభ్యంతర పెట్టడానికి కారణాలు ఏవీ కనపడలా-కాకపోతే తన కుటుంబ నేపధ్యం అదీ చెప్పాడు- ఎందుకంటే లలిత ఎగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన అమ్మాయి-తన తల్లితండ్రులు మంచి ఉద్యోగాల్లో ఉన్నవాళ్ళు.

లలితతో అదే మాట అన్నాడు-‘‘మీ తల్లి తండ్రుల ఇష్టంతో చేసుకుందాం.మీ వాళ్లకి ఏదైనా అభ్యంతరం ఉంటే మాత్రం మనం ఈ విషయంలో ముందుకు వెళ్లొద్దు, ఈ విషయం మన మధ్యనే ఉండిపోవాలి’’- అతని సంస్కారానికి, సహృదయతకి లలిత ఇంకా ఆకర్షితురాలయింది.

అలాగే అని సూర్యానికి చెప్పింది- సమయం చూసుకుని ఇంట్లో ఈ ప్రస్తావన తెచ్చింది తల్లితండ్రుల దగ్గర. ఏమీ దాచకుండా సూర్యం నేపధ్యం, అనాధ అయిన పండూని తన దగ్గర ఉంచుకుని చదివించడం గురించి కూడా చెప్పింది.సమాజంలో తరగతుల తేడా- అంతరం ఉండటంవల్ల లలిత తల్లి తండ్రులు సుముఖత చూపలేదు.

లలిత అప్పటికి ఆ ప్రస్తావన ఆపి కొన్నాళ్లతర్వాత తల్లితండ్రుల్నిఒక్కసారి సూర్యాన్ని కలవమని కోరింది. లలితకు నమ్మకం- సూర్యాన్ని చూస్తే ఖచ్చితంగా అతని వ్యక్తిత్వానికి తల్లితండ్రులు మెచ్చుకోకుండా ఉండలేరని- వాళ్ళ మనసు మార్చుకుంటారని.

సూర్యాన్ని,పండూని కూడా ఒకరోజు వాళ్ల ఇంటికి భోజనానికి పిలవమని లలితకి వాళ్ల నాన్న చెప్పాడు-ఒక ఆదివారం వాళ్ళిద్దరినీ తమ ఇంటికి ఆహ్వానించింది లలిత.

లలిత తల్లితండ్రులు పరిచయస్తులలాగే వీళ్ళతో ప్రవర్తించారు-సూర్యం తన నేపధ్యం,పండూ పరిచయం అయిన విధానం వాడి నేపధ్యం కూడా లలిత తల్లితండ్రులకు వివరించాడు.

సూర్యం, పండూ వెళ్ళిపోయినతర్వాత-లలిత తల్లితండ్రులు సూర్యం వ్యక్తిత్వానికి బాగా ముచ్చటపడ్డారు. ఎవరో అనాధని చేరదీసి, తనదగ్గర పెట్టుకుని సొంత తమ్ముడిలాగా చూసుకోవడం మామూలు విషయం కాదు.అందునా తన పెళ్లి అయిన తర్వాత కూడా పండూ తన దగ్గరే ఉంటాడని అతను అనడం, తమ కూతురు దానికి హృదయ పూర్వకంగా ఒప్పుకోవడం.

ఇద్దరి అభిప్రాయాలు ఆలోచనలు ఎంత దగ్గరగా ఉన్నాయి, తమకయినా ఇంతకన్నా గర్వం ఏముంది. సంబంధాలు వెతికితే మాత్రం ఇలా దొరుకుతారా- ''స్థాయి అనేది సిరి సంపదలలో కాదు ఆలోచనలలో ఉండాలి''- ''అతని పరిస్థితుల్లో మనం ఉన్నా సూర్యంలాగా ఆలోచించలేము'' అని అనుకున్నారు.

ఇవన్నిటికీ తోడు ''మన సమ్మతం లేకుండా లలిత కోరిన కోరిక విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయను'' అన్నాడు- దానికి వాళ్ళు మరీ ముచ్చటపడ్డారు- సూర్యం సంస్కారానికి!

లలితతో ఆనందంగా చెప్పారు తమకి ఈ పెళ్ళికి ఏ మాత్రం అభ్యంతరం లేదు  పైపెచ్చు సంతోషం అన్నారు.లలిత ఆనందానికి అవధులులేవు- తన ఓపికకి, సహనానికి ఆశించిన ఫలితం లభించింది అనుకుంది మనసులో-తల్లి తండ్రులిద్దర్నీ సంతోషంతో కౌగిలించుకుంది!

లలిత ఈవిషయం సూర్యానికి మరునాడు చెప్పడానికి తహతహలాడుతూ రాత్రి ఆనందంగా పడుకుంది- ఓ పట్టాన నిద్ర పట్టలేదు!

మరునాడు ఆఫీస్ కి వెళ్ళినప్పుడు సూర్యానికి ఆ శుభవార్త చెప్పింది, సూర్యం కూడా చాలా సంతోషించాడు లలిత తల్లితండ్రులు ఒప్పుకున్నందుకు మరియూ  లలిత తాను ఈ విషయాన్ని సహనంతో, పరిపక్వతతో వ్యవహరించి సాధించిన విధానానికి.

ఆరోజు ఇద్దరూ లంచ్ బయటకి వెళ్లి హోటల్ లో చేశారు, ఆఫీస్ లో అప్పుడే ఆ విషయం చెప్పకుండా ఒక సర్ ప్రైజ్ గా చెప్పుదామని అనుకున్నారు.

సాయంత్రం ఆఫీస్ అయిన తర్వాత లలిత కూడా సూర్యం ఇంటికి వస్తానని చెప్పింది- పండుతో ఈ కబురు తాను చెప్పాలని, సూర్యం దానికి సంతోషంగా ఒప్పుకున్నాడు.పండుకి ఈ కబురు లలిత చెప్పగానే చాలా సంబరపడిపోయాడు.తన అదృష్టానికి కూడా- ఒక అనాథగా ఉండేవాడికి తన జీవితంలో జరిగే ఈసంఘటనల్నినమ్మలేకపోతున్నాడు-అదృష్టం అనేది చాలా చిన్న పదంగా అనిపించింది వాడికి.

దీన్నే అంటారేమో- "వెన్ లక్ బిగిన్స్ టు కిక్, నోబడీ కెన్ చెక్" అని!!!

---

మరుసటి రోజు ఆఫీస్ వాళ్లకి మార్నింగ్ కాఫీ- స్నాక్ అందరి టేబుల్స్ దగ్గరకి పంపించారు- సర్ ప్రైజ్ కింద- "ఫ్రమ్ లలితా-సూర్యం అని ఒక కార్డుతో" ఈ విషయం ఎవరికీ ఊహలో కూడా లేదు- లలిత ఎప్పుడూ ఎవరితో అనలేదు తన సన్నిహితుల దగ్గరా బయట పడలేదు కూడా.నిజంగా ఈ వార్త అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది- అందరూ వెళ్లి వాళ్ళిద్దరికీ శుభాకాంక్షలు చెప్పారు మనస్ఫూర్తిగా.

లలితా- సూర్యంలో ఎవరు ఎవరికి మొదట ప్రపోజ్ చేశారు అనేది కూడా తెలియదు, అందరి బలవంతం మీద లలిత చెప్పింది జరిగిన విషయం మొత్తం.దానికి లలితని సూర్యాన్ని కూడా అభినందించారు- "ఐడియల్ కపుల్- ఆదర్శమైన జంట" అని!

సూర్యం, లలిత ఇంటికి వెళ్లి లలిత తల్లితండ్రులకి తన కృతజ్ఞతలు తెలియచేసాడు- వాళ్ళ సమ్మతితో లలితని ఒకరోజు వాళ్ళ ఊరు తీసుకువెళ్లి తన అమ్మా-నాన్నలకి చూపించి విషయం చెప్తా అన్నారు. లలిత తండ్రి వాళ్ళ కార్ ని- డ్రైవర్ ని తీసుకొని వెళ్లమన్నారు.ఓ ఆదివారం సూర్యం లలితతో వాళ్ళ వూరికి వెళ్ళాడు- సూర్యం తల్లి తండ్రులు చాలా సంబరపడ్డారు.

చిన్నపాటి ఇల్లు-చుట్టూ ఉన్న పొలం, ఆ పల్లెటూరు లలితకి ఎంతో నచ్చింది, మునుపు ఒకటి రెండుసార్లు కాలేజీలో చదువుకునే రోజుల్లో ఓ స్నేహితురాలితో వాళ్ళ పల్లెటూరు వెళ్ళినప్పుడు చూసింది ఈ వాతావరణం.తర్వాత ఇప్పుడే పల్లెటూరికి రావడం -అదే మాట సూర్యం తల్లి తండ్రులకి చెప్పింది.

ఆపూట వాళ్లిద్దరూ అక్కడే భోజనం చేసి తిరిగి వెనక్కి వెళ్లిపోయారు!

సూర్యం- లలిత ఇళ్ల వేటలో పడ్డారు-కాస్త తిరిగిన తర్వాత త్రీ బెడ్ రూమ్ అపార్ట్మెంట్ దొరికింది-బయానా ఇచ్చారు-మరుసటి నెలలో పెళ్లి ముహుర్తాలు పెట్టారు.లలిత ఇంట్లో అందరూ పెళ్లి హడావుడిలో మునిగిపోయారు, లలిత ఒక్కటే సంతానం అవడం, అందునా సూర్యాన్ని వాళ్ళు ఇష్టపడటం వల్ల కూడా లలిత తల్లితండ్రులు చాలా ఉత్సాహంగా ఉన్నారు.

దగ్గర బంధువులకు సూర్యం గురించి తెలిసి-ఆక్షేపణగా వెనకాల నోరునొక్కుకున్న వాళ్ళు కొందరయితే మరికొందరు హృదయ పూర్వకంగానే సంతోషించారు లలిత ఎంపికకు, తల్లి తండ్రుల పెద్ద మనసుకి- మరో వైపు పండు తన మానాన చదువులో మునిగిపోయాడు.

వారాంతాలలో సూర్యం లలిత పెళ్లి షాపింగ్ చేస్తున్నారు, పెళ్లి ముహూర్తం రానేవచ్చింది-పెళ్లి చాలా ఆర్భాటంగా ఘనంగా చేశారు లలిత తల్లితండ్రులు.నోరు నొక్కుకున్న, ముక్కున వేళ్ళు వేసుకున్న కొంతమంది సూర్యాన్ని, పండుని కూడా చూసిన తర్వాత మెచ్చుకోకుండా ఉండలేకపోయారు.ఒక విధంగా చెప్పాలంటే- అందరి దృష్టి కొత్త దంపతుల మీదే పడింది పెళ్లి సమయంలో-లలిత ఎంపికని అందరూ అభినందించలేకుండా ఉండలేకపోయారు.

ఆఫీస్ వాళ్ళు కానుకతో బాటు ఒక "సర్ ప్రైజ్ గిఫ్ట్" ఇచ్చారు-వీళ్ళ హనీమూన్ కి ఒక వారం పాటు హోటల్ బుకింగ్- రానూ పోనూ ఫ్లైట్ టిక్కెట్లు ఇచ్చారు.పెళ్ళికి వచ్చిన వాళ్ళు అందరూ ఆశ్చర్యపోయారు-లలిత, సూర్యం- లలిత తల్లితండ్రులతో సహా- లలితా-సూర్యం మీద ఎంత ప్రేమా-అభిమానం లేకపోతె ఆఫీస్ సహోద్యుగులు ఇలా మనస్ఫూర్తిగా చేయగలుగుతారు.

కొత్త దంపతులు ఓ రెండురోజులు వెళ్లి సూర్యం వాళ్ళ ఊళ్ళో కూడా ఉండివచ్చారు.ఓ మంచిరోజు చూసుకొని అపార్ట్మెంట్ లో గృహప్రవేశం చేశారు- కొత్త దంపతులు అవడం మూలాన సత్యనారాయణ వ్రతం కూడా చేసుకున్నారు.సూర్యం, లలిత తల్లి తండ్రులు- ఆఫీస్ వాళ్ళని భోజనాలకి పిలిచారు.

కొత్త ఇంట్లోకి కావాల్సిన సామాను లలిత తల్లితండ్రులు అమర్చారు-లలిత తల్లి తండ్రుల బలవంత చేయడం వల్ల సూర్యానికి ఇష్టం లేకపోయినా కాదన లేకపోయాడు-వాళ్ళు బాధపడతారని.

హనీమూన్ ట్రిప్ అయిన తర్వాత ఓ వారం రోజులు సూర్యం -లలితా ఇద్దరూ లలితా వాళ్ళింట్లో ఉన్నారు. వీళ్ళు లేని సమయంలో టిఫిన్ వరకు పండు ఇంట్లో చేసుకునేవాడు, భోజనాలు మాత్రం బయట తినేసేవాడు.లలితా-సూర్యం సెలవులు అయిపోయిన తర్వాత ఆఫీస్ కి వెళ్లడం మొదలుపెట్టారు.

సూర్యానికి, పండూకి వంట చేసే అలవాటు, ఇంట్లో పనులు చేసుకునే అలవాటు  ఉండటం వల్లా, వంటఇంట్లో పనుల్లో పండు కూడా ఓ చేయి వెయ్యడంవల్ల లలితకి కూడా పెద్ద ఇబ్బంది ఉండేదికాదు.

కాలం ఎవరికోసం ఆగదు, అలా రెండేళ్లు గడిచిపోయాయి-లలితా-సూర్యం కి ఒక ఆడపిల్ల పుట్టింది- ''శ్రావణి'' అని పేరు పెట్టారు-ఇంటి మహాలక్ష్మి అని అందరూ సంతోషించారు.పండూ అయితే మరీనూ, ఏ మాత్రం వీలు దొరికినా శ్రావణిని ఆడిస్తూ ఉండేవాడు.

ఇద్దరి జీతాలు పెరగడం వల్లా,సూర్యానికి పదోన్నతి రావడం వల్ల సొంతగా ఒక అపార్ట్మెంట్ కొనాలని అనుకున్నారు.పాప కూడా పుట్టడంతో ఓ త్రీ బెడ్ రూమ్ అపార్ట్మెంట్-ఆఫీస్ కి దగ్గరలో కొన్నారు. పండూకి తాను ఒక అనాధని అనే సంగతే మర్చిపోయాడు.లలితా, ఆమె తల్లితండ్రులు కూడా పండూని వాళ్లలో ఒక మనిషిగానే చూసేవాళ్ళు, పండూ తన అదృష్టానికి చాల ఆనందపడ్డాడు మనసులో.

లలిత తల్లి గొడవచేయడం వల్ల- శ్రావణిని- లలితా వాళ్ళు తన అమ్మవాళ్ళ దగ్గర దింపేసి ఆఫీస్ కి వెళ్ళేవాళ్ళు ఇద్దరూ, మళ్ళీ సాయంత్రం ఇంటికి వెళ్ళేటప్పుడు శ్రావణిని ఇంటికి తీసుకెళ్లేవారు-దీనితో లలిత తల్లితండ్రులకు సంతోషంగా, కాలక్షేపంగా కూడా ఉండేది!

గమనించేలోపే ఇట్టే నాలుగేళ్లు గడిచిపోయాయి,రెండో కానుపులో లలితకి మగ పిల్లాడు పుట్టాడు- ''శ్రవణ్'' అని పేరు పెట్టారు- అక్కా-తమ్ముళ్ల పేర్లు దగ్గరగా ఉంటాయని.పండూ కూడా ఇంజనీరింగ్ కాలేజీలో టాప్ ర్యాంకర్ గా వచ్చాడు.దానితో కళాశాల ప్రాంగణంలోనే ఓ మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది మంచి జీతంతో బాటుగా.

కాకపోతే ఉద్యోగం వేరే నగరంలో అవడంతో వీళ్లందరినీ ఒదిలేసి వెళ్లిపోవాలంటే మాత్రం చాలా బెంగ పడ్డాడు-అదే మాట సూర్యంతో,లలితతో అన్నాడు.ఉద్యోగం చేరే సమయంలోపే ఓసారి లలితా-సూర్యంతో సూర్యం వాళ్ళ ఊరు వెళ్లి వచ్చాడు, అలాగే యాదమ్మని కూడా చూసి వచ్చాడు.

యాదమ్మ వయసు పైన పడుతోంది-పండూ మనసులో యాదమ్మని తన దగ్గరికి తీసుకెళ్లాలని నిశ్చయించుకున్నాడు- ముందుగా ఈ విషయం సూర్యం, లలితలకు చెప్పాడు, వాళ్లిద్దరూ చాలా సంతోషించి పండూని మెచ్చుకున్నారు ఆ ఆలోచన వచ్చినందుకు-తల్లి లాంటి ఆమెని ఈ పెద్ద వయసులో సుఖపెట్టాలని కృతజ్ఞతా భావంతో.యాదమ్మ, పండూ నోట ఆ మాటవిని చాలా సంబరపడిపోయింది- కానీ తనకి మాత్రం ఆ ఇల్లు తన ఇంటికి వచ్చే పిల్లల్ని వదలాలని లేదు అని చెప్పింది.

సూర్యం-లలితా కూడా నచ్చ చెప్పారు- "ఇంకా వయసు మీరిన తర్వాత నిన్ను ఎవరు చూస్తారు యాదమ్మ, మేమందరం ఉండికూడా నువ్వు ఇలాగ ఈ వయసులో ఎందుకు ఉండాలి,ఇప్పుడన్నా సుఖపడు పండు దగ్గర" అని.దానితో యాదమ్మ అయిష్టంగానే ఒప్పుకున్నా ఒకందుకు సంతోషించింది- తన జీవితంలోని చివరి రోజుల గురించి ఆలోచించవలసిన పనిలేదు అని.

స్వార్ధం లేకుండా, ఇతరులకు మంచిచేసే స్వభావం ఉన్న వ్యక్తులను భగవంతుడు ఓకంట కనిపెడుతూ ఉంటాడు- సమయం వచ్చినప్పుడు తప్పక వాళ్లకు-వాళ్ళు ఊహించని విధంగా మేలు చేస్తుంటాడు.

పండూ వెళ్ళిపోతాడు తమ దగ్గరనుంచి అని అనుకుంటున్నప్పటినుంచీ సూర్యానికి బాధగా ఉంది లలితకన్నా-సహజంగానే.అదే సమయంలో వాడు యాదమ్మని తనతో తీసుకెళ్తా అనడం చాలా నచ్చింది. రావిచెట్టుకింద ఉండే పండు ఇలా ఎదగడం-సూర్యానికి గర్వంగా కూడా అనిపించింది- ఏదో చెప్పలేని తృప్తి కూడా కలిగింది.

అప్పుడు హఠాత్తుగా యధాలాపంగా యాదమ్మ కొన్నేళ్ల క్రితం అన్న మాటలు గుర్తు కొచ్చాయి- తాను పండూని తన దగ్గరకు తెచ్చుకుంటున్నప్పుడు!

యాదమ్మ, పండూ కూడా తనకు దూరం అయిపోతున్నారు- ఇప్పుడైనా ఆ అనాధ  ఆశ్రమానికి వెళ్తే పండు గురించి వివరాలు ఏమైనా తెలుస్తాయి అని ఒక రోజు అక్కడకి వెళ్లి తన ని పరిచయం చేసుకున్నాడు. తాను పండుని కలిసిన విధానం, దాని తార్వాత వాడిని తన దగ్గర ఉంచుకోవడం, చదివించడం వాడు ఉద్యోగస్తుడు అవడం.ఏ యాదమ్మ అయితే పండుని వీళ్ళ దగ్గర నుంచి తీసుకెళ్ళిందో ఆ  యాదమ్మని పండు తనతో తీసుకెళ్లాలని అనుకోవడం వరకూ అన్నీ వివిరంగా చెప్పాడు.

అక్కడ ఉన్న అధికారి ఈ కధ అంతా విని చాలా ఆనందించాడు!

సూర్యం పండు వివరాలు అడిగాడు, అతన్ని ఎవరు ఇక్కడ చేర్పించారు,లేదా ఎవరైనా వదిలేశారా అని.

అప్పుడు ఆ అధికారి సూర్యంతో- - -

ఓ వ్యక్తి పేరు, వివరాలు, చిరునామా ఇచ్చాడు- వాళ్ళ పుస్తకాలలో ఉన్న వివరాలు చూసి- ఆ వివరాలతో బాటు ఓ ఫోటో కూడా చూపించాడు.అది చూసి సూర్యం నిర్ఘాంతపోయాడు.అత్యృతతో వివరాలు ఇంకా ఏమైనా ఉంటే చెప్పమన్నాడు. పండుని ఇక్కడ చేర్పించిన మనిషి ఇచ్చి వెళ్లాడని, అంతవరకే తనకు తెలుసు అని మిగతా వివరాలు కావాలంటే ఇక్కడ గత యాభై ఏళ్లుగా ఉంటున్న ఆ అనాథ ఆశ్రమాన్ని పెట్టిన యజమానికి తెలిసివుంటాయని చెప్పాడు ఆ వ్యక్తి!

వెంటనే ఆ వ్యక్తి దగ్గర అనుమతి తీసుకుని ఫోటో తీసుకున్నాడు,ఆశ్రమ యజమాని ఇంటి చిరునామా తీసుకున్నాడు- అక్కడనుంచి తిన్నగా ఆ ఇంటికి బయలుదేరాడు ఆయన్ని కలిసి తన పేరు నేపథ్యం చెప్పాడు.

‘‘చిన్నవాడివి అయినా నీకు చేతులెత్తి దండం పెట్టాలి బాబు,నీవు చూపిన ఔదార్యానికి’’ అన్నాడు- సూర్యం వారిస్తూ, సిగ్గుపడుతూ- - -

‘‘సర్,మీరు చేసే పనిముందు నేను చేసింది ఎంత- ఎవరో తెలియని అనాథ బాలలకు ఆశ్రయం ఇస్తున్నారు ఐదు దశాబ్దాలుగా’’ అని ఆయనకు నమస్కరించాడు- రెండు చేతులతో మనస్ఫూర్తిగా!

ఆయన కూడా చాలా ఆనందించాడు పండు వివరాలు తెలుసుకొని,యాదమ్మ కూడా తెలియడం వల్ల ఆమె విషయానికి కూడా చాలా సంతోషించాడు- పండు చేసే పనికి మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

సూర్యం తాను వచ్చిన పని చెప్పాడు తాను ఆశ్రమం నుంచి తెచ్చిన ఫోటో చూపించి- అప్పుడు ఆయన ఒక రెండు నిమిషాల సమయం తీసుకుని- చెప్పడం మొదలు పెట్టాడు- - -.

‘‘పండుని తెచ్చిన వ్యక్తి ఓ రోజు బయటకు వెళ్తున్నప్పుడు రోడ్డుమీద ఓ ప్రమాదం జరిగిన సంఘటన చూశాడట.జనం గుమికూడి ఉండటం చూసి తానూ అక్కడకి వెళ్ళాడు.అక్కడ ఓ మధ్య వయస్సు దంపతులు మరణించి ఉన్నారు,పక్కనే ఓ పిల్లాడు ఏడుస్తూ ఉండటం చూశాడట-ఆ స్థలంలో!

పోలీసుల్ని అడిగి ఇంకైనా ఆధారాలు ఉన్నాయేమో అని అడిగాడట, వాళ్ళదగ్గర ఉన్న సంచిలో ఈ ఫోటో ఉంది.ఏదో దారినపోయే దానయ్య లాగానో, బాటసారిలా కాకుండా అతను పోలీసులకి తన పేరు చిరునామా ఇచ్చి ఆ పిల్లాణ్ణి ఏదైనా అనాథ ఆశ్రమంలో చేర్పిస్తాను అన్నాడు.సాధారణంగా పోలీసులు అంత సులువుగా ఒప్పుకోరు-అతన్ని ఉండమని చెప్పి ఇంకో పోలీస్ ని ఇచ్చి అతనితో వెళ్లమన్నారు.

ఆవ్యక్తి,పోలీస్ కలిసి పండుతో మా ఆశ్రమానికి వచ్చారు; రిజిస్టర్ లో వివరాలు రాసుకుని ఈ ఫోటో మా దగ్గర భద్రపరిచాం'' అని ఒక నిమిషం చెప్పడం ఆపాడు.
''ఆ ఫోటోకి పండూకి సంబంధం ఏదో ఉండిఉండాలి,ఇదొక్కటే వాడి నేపథ్యం తెలియాలంటే ఉన్న ఒక ఆధారం కూడా'' అన్నాడు.

సూర్యానికి జలజల కళ్ళ నీళ్లు రాలుతున్నాయి ధారగా- సూర్యం ఎందుకు ఏడుస్తున్నాడో ఆ పెద్ద మనిషికి అర్థం అవ్వలేదు.అక్కడ నుంచి సూర్యం చెప్పడం మొదలు పెట్టాడు ఆయనతో "పండూ ఎవరో కాదు సర్, నా సొంత తమ్ముడు" అన్నాడు ఆనందంతో ఏడుస్తూ-జరిగిన కథ చెప్పడం మొదలు పెట్టాడు.

''మా బాబాయ్ వాళ్లకి పిల్లలు లేరు,ఈ నగరంలో చిన్న ఉద్యోగం చేస్తుండేవాడు, మానాన్న,బాబాయి చాలా అన్యోన్యంగా పెరిగిన అన్నదమ్ములు.తనకి పిల్లలు లేక పోవడంతో-బాబాయ్-పిన్నీ పండూని పెంచుకుంటాం అన్నారు.అమ్మా-నాన్నకి ఇష్టం లేక పోయినా, నాన్నకి బాబాయ్ మీద ఉన్న ప్రేమతో అమ్మని ఒప్పించి పండుని వాళ్ళ చేతుల్లో పెట్టారు.

అలా వాళ్ళు పండూని మాఊరినుంచి ఈ నగరానికి వచ్చినప్పుడు పెద్ద ప్రమాదానికి గురి అయ్యారని, చనిపోయారని తెలిసింది.అనుకోకుండా వాళ్ళశరీరాల్ని హాస్పిటల్ కి తీసుకెళ్లినప్పుడు మా ఊరివాళ్ళు అక్కడ ఉండటంవల్ల బాబయ్య- పిన్నిని గుర్తుపట్టారు.

దురదృష్టవశాత్తూ, వాళ్ళ ఇంట్లోవాళ్ళు ప్రమాదంలో ఉండి చికిత్స పొందుతుండటంతో అమ్మా- నాన్నకి ఈవిషయం తెలిసేసరికి చాలా ఆలస్యం అయింది.తర్వాత ఈ నగరానికి వచ్చి పండు గురించి చాలా వాకబు చేశారు, ఎక్కడా తెలియలేదు మాకు పండు ఏమయిపోయాడో-అప్పటినుంచి ఇంట్లో అందరం పండూ గురించి ఆశలు వదిలేశాం''

''కానీ దేవుడు ఎంత గొప్పవాడు సర్, వాడు మీ దగ్గరకి చేరడం, అనుకోకుండా నేను కలవడం, ఇంతదాకా జరగడం ఓ గొప్ప అద్భుతం,మా అదృష్టం కూడా.ఈ సంగతి తెలిసిన అమ్మ నాన్న సంతోషానికి హద్దే ఉండదు'' అన్నాడు.

అసలు అనాధ ఆశ్రమానికి ఇన్నేళ్లు వెళ్లకుండా ఎందుకున్నా అని తెగబాధపడిపోయాడు సూర్యం-కళ్లెదురుగానే సొంత తమ్ముణ్ణి పెట్టుకుని తెలుసుకోలేకపోయాను అని అనుకున్నాడు.ఈవిధంగా కలవాలని భగవంతుడు నిర్ణయించడం వల్లే, ఆరోజు ఫైల్ మర్చిపోవడం జరిగింది,ఆ ఫైల్ మర్చిపోకుండా ఉంటే అసలు పండూ తెలిసేవాడే కాదుకదా అని దేవుడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

ఈ కధ విన్న ఆయన కళ్ళలో కూడా ధారాపాతంగా నీళ్లు కారాయి సంతోషంతో-
ఓఅనాధ బాలుడికి ఓ కుటుంబం దొరకడం భగవంతుడి లీల కాక మరేమిటి అనుకున్నాడు!

తన వివరాలు అన్నీ ఆయనకు ఇచ్చి ఆఘమేఘాల మీద ఇంటికి చేరాడు- పండూని దగ్గరకి తీసుకొని ఏడ్చేశాడు సూర్యం, లలితకీ- పండుకీ ఏడుస్తూ జరిగిన విషయం చేప్పాడు.వాళ్ళిద్దరికీ నమ్మశక్యమే కాలేదు సూర్యం మాటలు- పండూకి అసలు నోటమాట రాలేదు.

ఆశ్రమంలో చేర్పించిన వ్యక్తిని కలిసి వస్తామని- ఆ లోపు లలితని ఊరు ప్రయాణానికి సిద్ధం అవమని చెప్పాడు!

తర్వాత పండుని తీసుకొని- పండుని అనాధ ఆశ్రమంలో చేర్పించిన వ్యక్తి ఇంటికి వెళ్ళాడు-అవ్యక్తి ఇంట్లో లేకపోయేసరికి అక్కడే అతని కోసం వేచి చూసారు; కాసేపటికి ఆ వ్యక్తి రాగానే- విషయం అంతా చెప్పి సూర్యం అతనికి కృతజ్ఞతా భావంతో కాళ్ళకి నమస్కరించాడు అప్రయత్నంగా-
ఆ వ్యక్తి వారిస్తున్నా!

ఆ వ్యక్తి కూడా చాలా సంతోషించి సూర్యాన్ని దగ్గరకు తీసుకున్నాడు- ఇవేమి తెలియని పండు సంభ్రమాశ్చర్యానికి గురి అయ్యాడు- కళ్ళముందు జరుగుతున్నవన్నీ కలో నిజమో నమ్మలేని పరిస్థితి వాడిది-ఆ వ్యక్తి దగ్గర వీడ్కోలు తీసుకుని ఇంటికి బయలుదేరి వెళ్లారు.

వెంటనే లలితా-సూర్యం, పిల్లలు,పండు అప్పటికప్పుడు సూర్యం వాళ్ళ ఊరికి బయలుదేరారు;ప్రయాణం దారిలో- లలిత వాళ్ళ అమ్మా-నాన్నలకి ఫోన్ చేసి విషయం అంతా చెప్పింది-వాళ్ళూ కూడా చాలా ఆనందించారు.

వీళ్ళు అందరు ఊరు చేరారు- హఠాత్తుగా వీళ్ళందరూ రావడంతో సూర్యం తల్లితండ్రులకి విషయం అర్ధం కాలేదు.సూర్యం చెప్పిన విషయం వింటూ వాళ్ళిద్దరి నోటా మాటలు పెగల్లేదు, సంవత్సారాల క్రితం ఏమైపోయాడో తెలియని కొడుకు కళ్ళముందు అంత పెద్దవాడై ఉండటంతో-

పట్టరాని ఆనందంతో పండూని దగ్గరకు తీసుకున్నారు! ఇన్నేళ్ళనుంచి వస్తున్నా,సూర్యంతో ఉన్నా,అందరి కళ్ళముందే ఉంటున్నా తమకు తెలియకపోవడం  సంతోషం, బాధ కలిగించింది-ఆ ఇంట పండుగ వాతావరణమే నెలకొంది.

అక్కడ రావిచెట్టు మీద ఉన్న త్రిమూర్తులు నవ్వుకుంటున్నారు!

# సమాప్తం!!!

చివరగా ------

చూసారు కదా, నిస్వార్ధంగా సూర్యం ఎలాంటి సాయం చేసాడో- దాని స్ఫూర్తిగా తీసుకున్న పండు, తల్లిలాంటి యాదమ్మని తన సొంత తల్లితండ్రుల దగ్గర ఉంచవచ్చు- అలా కాకుండా నిజం తెలిసిన తర్వాత కూడా తన దగ్గరకే తీసుకెళ్ళాలి అని నిశ్చయించుకున్నాడు. పండు తన తర్వాత జీవితంలో సూర్యంలాగే తన చుట్టుపక్కల వాళ్లకి ఖచ్చితంగా సహాయం చేస్తాడని మనం ఊహించుకోవచ్చు!

మనకు ఇతరులకి సాయం చేస్తే వచ్చే ఆనందం అనిర్వచనీయం, అనుభవైకవేద్యం. అదీకాక ఇలా చూసినప్పుడు అవతలవాళ్ళు కూడా ప్రేరణ పొందటానికి చాలా శాతం అవకాశం ఉంది!

ఎప్పుడూ నేను,నా కుటుంబం,నావాళ్ళే అనుకోకుండా మనకు చేతనయినంతలో ఇతరులకు సాయం చేద్దాం;దానిలో ఉన్న ఆనందాన్ని,సంతోషాన్ని సొంతం చేసుకుందాం జీవితం సార్ధకం అవుతుంది.మనం జీవించేది ఒక్క సారే, కానీ బోలెడన్ని గుండెల్లో చిరంజీవుల్లాగా ఉండిపోతాం.

సూర్యం లాంటి అజ్ఞాతవ్యక్తులు మన సమాజంలో చాలామంది ఉన్నారు-ఈ కథ  అలాంటి వారందరికీ ప్రేమతో  అంకితం.

ఇది పాత ఇతివృత్తమే- నా శైలిలో చెప్పే చిన్ని ప్రయత్నమే ఇది!
మీ అభిప్రాయాలు తెలియచేయండి-అది ఎలాంటిదైనా సరే-భవిష్యత్తులో రాయబోయే నారాతలు సరిద్దుకోడానికి,మెరుగు పరుచుకోవడానికి  ఉపయోగపడతాయి !

# రమేష్ బట్టల షాప్

ఉపోద్ఘాతం!

విధి ఎంత బలీయమైనదో మనం పురాణాల్లో, భారత- భాగవతాల్లో చదివాము- మనం చూస్తూనేఉన్నాం కూడా-ఎంతటి వాళ్లకైనా ఇది తప్పదేమో-"ఓడలు బళ్ళు- బళ్ళు ఓడలు అవుతాయి" అన్నట్టుగా!

ఈ కలియుగంలో కూడా ఇలాంటి వ్యక్తుల్ని మనకు తెలిసినవాళ్ళకి జరగడం,మన కళ్ళతోనే చూసిఉంటాం, మరి కొంతమంది గురించి వార్తల్లోగానీ చదివి ఉంటాం.అదే సమయంలో "విధివంచితులు" అయిన కొందరు గడ్డుపరిస్థితులు ఎదుర్కొని విధికి ఎదురొడ్డి, నిలబడిన జయించిన వ్యక్తుల జీవితాలను కూడా అప్పుడప్పుడు విని ఉంటాం.

నా ఆప్తమిత్రుల్లో ఒకరి జీవిత గాథ మీకు చెప్పబోతున్నాఅతని జీవితంలో జరిగిన యదార్థసంఘటనలు- మనం ఎవ్వరం నమ్మం మన కళ్ళముందు మనవాళ్లకి జరిగిందీ అంటే.నన్ను మానసికంగా బాగా కదిలించివేసింది- అతనితో పరిచయం 1977 నుంచి!

ఇలాంటివాళ్ళు మనందరికీ స్ఫూర్తిదాయకం- మరీముఖ్యంగా భగవంతుడు అన్నీ ఇచ్చినా- ఇచ్చిన వాటికి సంతృప్తిపడకుండా, ఇంకా జీవితంలో ఏదోలేదు అని వగచే మనుషులని కూడా మన మధ్యన- సమాజంలో నిత్యం చూస్తూ ఉంటాం కూడా.

కాకపోతే నాస్నేహితుడి పేరు అందరి పాత్రల పేర్లు మార్చి రాస్తున్నాను- అతని ఉనికి బయట పెట్టడం ఇష్టం లేక-ఎందుకంటే, నా వ్యాసాలూ, కథలు, జ్ఞాపకాలు పబ్లిక్ డొమైన్ లో పోస్ట్ చేస్తా కాబట్టి.

నేను తన కథ రాద్దామని నా మనసుకి అనిపించింది, ఈ రోజుల్లో చాలామంది చిన్న చిన్న కష్టాలకి, జరిగే సంఘటనలకు తల్లడిల్లి పోవడం చూస్తున్నాం.నా స్నేహితుని కథ రాయడంలో నా ఉద్దేశం- డబ్బుకి లోపం లేకుండా చక్కగా దర్జాగా వ్యాపారం చేస్తున్న వ్యక్తి జీవితం తల్లకిందులై పోయిన వృత్తాంతం తెలియచేయడం కోసమే-అందరం నేర్చుకోవాల్సింది ఎంతోఉంది.అతని మానసిక పరిస్థితి, కష్టాలు ఎలా ఎదుర్కొన్నాడు -అనేవి తెలియచెప్పాలని అనిపించింది.

ఇది కథ కాదు- ఓ వ్యక్తి జీవిత యదార్ధ గాథ!

అందరూ మీ సమయం వెచ్చించి ఈ కథని తప్పక చదవాలని కోరుతున్నా;
ఖచ్చితంగా మీ కంట నీరు రాక మానదు, మీ హృదయాన్ని తట్టకుండా ఉండదు -జీవితంలో ఊహించని కష్టాలుపడి, ధక్కామొక్కీలు తిని నిలబడ్డాడు- కుటుంబాన్ని నిలబెట్టాడు.నా స్నేహితుడిఅనుమతి తీసుకుని ఇది రాస్తున్నాను!

కథలోకి వెళ్తాను...

కామేశ్వరరావుగారు ఆయన జీవితాన్ని ఓ బట్టల షాప్ ఏజెన్సీ లో పనిచేస్తూ మొదలు పెట్టారు.
వ్యాపారనిమిత్తం- అమ్మకాలకోసం బోలెడు ఊళ్ళు తిరుగుతూ

ఆఊళ్లలో ఉన్న అన్ని ముఖ్యమైన షాపులకు వెళ్లేవారు.స్వతహాగా నెమ్మదస్తుడు, మంచివ్యక్తి అవటంతో మంచిపేరు కూడా తెచ్చుకున్నారు- వ్యాపార అభివృద్ధితో బాటు.

క్రమేపి అంచెలంచెలుగా తాను పనిచేసేచోట బాధ్యతలు -ఆదాయం కూడా పెరిగాయి. చాలా కష్టపడిన తర్వాత కొన్నేళ్ళకు తన సొంతగా వ్యాపారం పెట్టుకునే స్థాయికి ఎదిగారు. ఒక రోజున తానూ సొంతగా వ్యాపారం మొదలు పెట్టాలనుకున్నాడు- పిల్లలు ఎదగడంతో.తన మనసులో మాటలని తాను పనిచేసే చోట యజమానితో చేప్పాడు. కామేశ్వరరావు వెళితే తన వ్యాపారానికి చాలా ఇబ్బంది అని తెలిసినా పెద్దమనసుతో అలాగే అన్నాడు అయిష్టంగానే- అంత మంచి మనిషిని వదులుకోవడం ఇష్టం లేకపోయినా!

అలా కామేశ్వరరావు సొంతగా వ్యాపారం మొదలు పెట్టాడు-రేయింబవళ్లు చాలా కష్టపడి వ్యాపారాన్ని కొద్దికాలంలోనే అభివృద్ధి చేసాడు.

ఆయనకు ఇద్దరు పిల్లలు- పెద్దవాడు కామేష్, చిన్నవాడు రమేష్-ఇద్దరూ చదువుకున్నవాళ్ళు.పెద్ద అతను డిగ్రీ వరకు చదువుకున్నాడు, రమేష్ కి చదువు మీద పెద్దగా ఆసక్తి లేకపోవడం వల్ల ఇంటర్మీడియట్ అవగానే చదువు ఆపేసాడు.

ఇంక అక్కడా ఇక్కడా ఎందుకని తనకు చేదోడుగా ఉంటాడని తనతోబాటు ఊళ్ళకి తీసుకెళ్లేవారు వ్యాపార నిమిత్తం.కుర్రవాడు అవడం, అందునా మాటకారి కూడా అవటం మూలాన వ్యాపార మెళకువలు తొందరగా పట్టేసాడు.కొన్నేళ్ల తర్వాత వాళ్ళ నాన్నతో మాట్లాడి ఒక బట్టల షాప్ పెట్టాడు మంచి వ్యాపార కూడలిలో.

కామేశ్వరరావుగారి పెద్ద అబ్బాయి కామేష్ తన డిగ్రీ అయిన తర్వాత వాళ్ల నాన్నతో పాటు తిరుగుతూ కొన్ని ఇతర కంపెనీల ఏజెన్సీలు సంపాందించాడు- ఉన్న ఏజెన్సీలతో బాటు.

ఎలాగూ చిన్నవాడు షాప్ పెట్టడం జరిగింది కాబట్టి,ఉన్న ఏజెన్సీలు ఇద్దరి కొడుకులకి సమంగా పంచాడు.

కామేష్ తాను సొంతగా ఏజెన్సీలు చూసుకునేవాడు,కామేశ్వరరావుగారు వయసు మీద పడటంతో రమేష్ ని ఏజెన్సీల పనిమీద పంపేవారు, ఆ సమయంలో ఆయన షాప్ లో కూర్చునేవారు; నెలలో ఓ వారం పదిరోజులే ఏజెన్సీ పని ఉండేది.కొడుకుకి చేయూతగా అప్పుడప్పుడు ఆయన ఏజెన్సీ పనిమీద ఊళ్లకు వెళ్లేవారు కూడా.

అలా ఇద్దరు కొడుకులు ఎవరి వ్యాపారాలు వాళ్ళు అభివృద్ధి చేస్తున్నారు.ఇద్దరి కొడుకులకు పెళ్లిళ్లు అయిపోయినాయి, రోజులు గడుస్తున్నాయి సాఫీగా.కామేష్ కు ఇద్దరు కొడుకులు, రమేష్ కు ముగ్గురు కొడుకులు కలిగారు.

రమేష్ ముగ్గురు పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు, తాను చదువు మధ్యలోనే మానేయడంవల్ల పిల్లల చదువుమీద చాలా శ్రద్ధ పెట్టేవాడు.పిల్లల భవిష్యత్తు దృష్ట్యా కొద్దిగా కష్టమైనా వేరే ఊళ్ళో హాస్టల్ లో పెట్టి చదివించేవాడు. ఒకపక్క వ్యాపార అభివృద్ధికి ఎప్పటికప్పుడు తన కస్టమర్లకి కానుకలు ఇవ్వడం, కస్టమర్ల పిల్లల పుట్టిన రోజులకి శుభాకాంక్షలతో కార్డులు పంపడం ఆ సమయంలో వారికి స్పెషల్ గా ధరలు తగ్గించి ఇవ్వడం చేసేవాడు-  ఇవన్నీ ఆ రోజుల్లో ప్రత్యేకతలు, ఏ షాప్ వాళ్ళు చేసేవాళ్ళు కాదు!

వార్తాపత్రికల్లో ప్రచారం చేసేవాడు,దీనితో పెట్టుబడి కూడా పెంచవలసివచ్చేది- దానితో అక్కడా ఇక్కడా చేబదుళ్ళు తెచ్చేవాడు వడ్డీకి.కొద్దిగా ఎక్కువగా ఏజెన్సీ పనుల మీద తిరుగుతూ వ్యాపారాన్ని పెంచే ప్రయత్నం చేసేవాడు.

కాలంలో మార్పుతో బాటు వ్యాపారాల్లోనూ మార్పులు సంభవించడం మొదలు పెట్టాయి-ఆ ఊళ్ళో పెద్ద పెద్ద అంగళ్ళు (మాల్స్) రావడం మొదలు అయింది.జనం కూడా మాల్స్ కి వెళ్ళడానికే ఎగబడేవాళ్లు-దానితో తన కస్టమర్లు కూడా మెల్లిగా రమేష్ షాప్ కి రావడం తగ్గించారు;ఈ మార్పుతో వ్యాపారంలో ఊహించనంత మార్పు వచ్చింది.

ఆదాయం తగ్గడం మొదలయింది-ఖర్చులు, వడ్డీలు కట్టడం ఆపలేదు కదా-అదే క్రమేపీ గుదిబండ అయిపోయింది.తాను దర్జాగా బతుకుతూ షాప్ లో వాళ్లకి ఆధారం కల్పిస్తున్న వ్యక్తి ఒక్కసారే గడ్డు రోజులు ఎదుర్కోవడం మొదలు పెట్టాడు.ఎన్నాళ్ళు తప్పించుకోగలడు అప్పులవాళ్ళనుంచి. అదే సమయంలో గత ముప్పయి ఏళ్లుగా తాను వ్యాపారం చేస్తున్న కంపెనీవాళ్ళు ఇంకోళ్ళకి కూడా ఏజెన్సీ ఇచ్చారు వాళ్ళ బట్టలకి.

దానితో పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయిపోయింది-ఏం చేయాలో పాలుపోలేదు!

ఆ సమయంలో తన దగ్గర సహాయం పొందినవాళ్ళు మొహం చాటేశారు,డబ్బులు రావాల్సినవాళ్లు కోర్ట్ కి వెళ్లారు.ఇంక ఒకరోజు రమేష్ ఒక నిర్ణయానికి వచ్చాడు. తాను,భార్య- ముగ్గురు పిల్లల్ని తీసుకుని రైల్ కిందపడి చనిపోవాలని నిర్ణయానికి వచ్చారు.

భార్యతో కూడా చర్చించాడు,గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ దిక్కూ తోచక భార్య కూడా ఒప్పుకుంది. అతను చేసిన మంచిపనులవల్లో, భగవంతుడి నిర్ణయం వేరే రకంగా ఉందో రమేష్ కి ఆ రోజురాత్రి మళ్ళీ ఆలోచన వచ్చింది.పొరపాటున రైలు కింద తానూ భార్య మాత్రమే చనిపోయి పిల్లలు బతికిపోతే వాళ్ళ జీవితాలు తల్చుకుంటే భయం వేసింది- పిల్లలు ఏ దిక్కూ లేని అనాధలవుతారని అనిపించింది.

తక్షణమే ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచన విరమించుకున్నారు.అప్పుల వాళ్ళ బాధ పడలేక సమాధానం చెప్పలేక సతమతమైపోయాడు రమేష్. ఏం చేయాలో తోచలేదు, కళ్ళముందు అన్నీ సమస్యలే దాంతో భార్య పిల్లల్ని వాళ్ళ సొంతఇంట్లో ఉంచి-రమేష్ అమ్మా-నాన్నలు అతనితోనే ఉండేవాళ్ళు-తాను ఎక్కడికో వెళిపోయాడు ఇంట్లో వాళ్లకి కూడా చెప్పకుండా.తన విషయాలు అన్నీ తెలిసిన ఆప్తమిత్రుల్లో ఒకతని సహాయం తీసుకొని రాష్ట్రం పొలిమేరల్లో ఉన్న ఓ చిన్న పట్నానికి వెళ్ళాడు-అక్కడ ఒక ట్రాన్స్ పోర్ట్ కంపెనీలో పనికి కుదిరాడు.

విధి ఎంత బలీయమైనదో   అతని విషయంలో-అంత బతుకు బతికి ఏ మనిషి  కూడా ఊహించని దయనీయస్థితికి చేరుకున్నాడు. ట్రాన్స్ పోర్ట్ కంపెనీలో పడుకునేవాడు,వాళ్ళు రోజు భోజనం పెట్టి 100 రూపాయలు ఇచ్చేవారు ప్రతీరోజు.

ఆ డబ్బులు అసలు ఖర్చుపెట్టుకోకుండా దాయటం మొదలుపెట్టాడు.

కామేశ్వర రావుగారి పెద్ద కొడుకు కామేష్- తన కొడుకు వివాహంచేసి వాళ్ళ అమ్మానాన్నల్ని కూడా పిలవలేదు.తర్వాత చుట్టాలు అడిగినప్పుడు "మేము వచ్చాం చివర్లో కూర్చున్నాం" అని చెప్పారు- పెద్ద కొడుకుని బయటపెట్టడం ఇష్టం లేక- అదీ తల్లితండ్రులంటే. కన్నతల్లితండ్రులన్న కనీస జ్ఞానం, కృతజ్ఞతలేని కొడుకుని కన్నారు.

ఈలోపల తన ఊర్లో అప్పులవాళ్ళు-తన ద్వారా అంతకుముందు సహాయం పొందిన మిత్రులే గతాన్ని మర్చి కోర్ట్ లో కేసు వేశారు.దానితో వాళ్ళ సొంతఇల్లు అమ్మాల్సి వచ్చింది చాలా తక్కువ ధరకే. దానితో నిలువనీడ లేకుండా అయిపొయింది.ఇది జరిగిన కొద్దీ రోజులకే రమేష్ అమ్మా నాన్న ఇద్దరూ చనిపోయారు.

రమేష్ కుటుంబానికి నిలువ నీడలేకుండా పోయింది,అటు కామేష్ కానీ,రమేష్ భార్య కుటుంబం వైపు గానీ ఏ మాత్రం సహాయం అందకపోగా వాళ్ళు మొహం చాటేశారు.

ఈలోపల అక్కడ కష్టాలు పడుతున్న రమేష్ అక్కడినుంచి తన ఊళ్ళో ఉన్న ఒక స్నేహితుని కి తన పరిస్థితి వివరించి ఏదో విధంగా సహాయం చేయమన్నాడు, అప్పుడు అతను రమేష్ ని కేరళ వెళ్ళమన్నాడు.

తనకు తెలిసినవాళ్ళ ద్వారా అక్కడ ఒకళ్ళకి ఇతని పరిస్థితి వివరించి రమేష్ ని కేరళ పంపించాడు!

———— ————

కొత్త ఊరు,కొత్త రాష్ట్రం అలాగే వెళ్ళాడు కొచ్చిన్ కి,అది ఒక ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీ.చాలా కంపెనీలకి లారీలు సరఫరా చేస్తుంటారు.అక్కడ పనికి కుదిరి-భార్య పిల్లల్ని కొచ్చిన్ వచ్చేయమన్నాడు-ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు.

ఇక్కడ ఒక విషయం మనం మాట్లాడుకోవాలి,రమేష్ విషయంలో జరిగిన ఈ సంఘటనలు కలలో కూడా ఊహించనవి.మొదట్లో ఆత్మహత్యలకు పాలు పడదామనుకున్న మనిషి-దైవానుగ్రహం వల్ల ఈరోజున అందరూ ప్రాణాలతో ఉన్నారు.అలాగే అంత దర్జాగా జీవితాన్ని కొనసాగించిన రమేష్ అతని కుటుంబం ఆ పరిస్థితిలో బతకడం.

మామూలుగా పరిస్థితులు జీర్ణించుకుని బతకడం అంత సులువుకాదు-రోజూ గతజీవితం గుర్తుకొస్తూ ఉంటుంది.కానీ రమేష్ మొక్కవోని ధైర్యంతో ఇది భగవంతుడి నిర్ణయం అనుకుని పరాయిరాష్ట్రంలో కుటుంబంతో తలదాచుకున్నాడు-అందరికీ దూరంగా.

అక్కడ నుంచి అతను చాలా కష్టపడాల్సి వచ్చేది-భార్య, ముగ్గురు పిల్లలు, పిల్లల్ని అక్కడే స్కూల్ లో చేర్పించాడు.భాష ఏ మాత్రం రాదు,అయినా పిల్లలు కష్టపడి చదువుకున్నారు, భాషా నేర్చుకున్నారు.

రమేష్ పనిచేసే కంపెనీ యజమాని చాలా మంచివాడు-కష్టసుఖాలు తెలిసిన మనిషి.తన ఊర్లో ఉన్న ప్రపపంచానికి తెలియదు రమేష్ కుటుంబం ఏమయిపోయారో అని; తోబుట్టువులు పట్టించుకోనప్పుడు చుట్టాలు స్నేహితులు ఎందుకు పట్టించుకుంటారు; ఒకళ్ళిద్దరు చిన్ననాటి  స్నేహితులకి ఫోన్ చేసి సహాయం అడిగాడు,వాళ్ళూ మొహం చాటేశారు,దానితో రమేష్ మానసికంగా చాలా మదనపడ్డాడు-స్నేహితుల ప్రవర్తనతో.

భార్యా భర్తలు ఒకళ్ళని మరొకళ్ళు ఓదార్చుకుంటూ జీవితాల్ని దేశంకాని దేశంలో సాగిస్తున్నారు-పిల్లలు పెద్దవాళ్ళు అయ్యారు.రమేష్ కంపెనీ యజమాని చాలా మంచివాడు అని ముందే చెప్పాను గదా-యజమాని కొడుకు కూడా వ్యాపారంలోకి వచ్చాడు. రమేష్ తండ్రి కామేశ్వర రావుగారి రక్తం కదా, ఒక రోజున రమేష్ తన యజమాని దగ్గర తాను కూడా సొంతగా ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్ట్స చేద్దామనుకుంటాన్నని దానికి ఆయన ఆశీర్వాదం కావాలని చెప్పాడు.

పెద్దాయన చాలా సంతోషంగా అంగీకరించాడు.దానితో రమేష్ సొంత వ్యాపారం మొదలు పెట్టాడు రెండవసారి జీవితంలో-

రమేష్ తన ఇల్లు అమ్మి కొన్ని అప్పులు తీర్చాడు-కానీ మరి కొంతమందికి బాకీ ఉన్నాడు-"పదమూడు ఏళ్ల క్రితం" రాసుకున్న ఆ కాగితం తన దగ్గర భద్రంగా ఉంది! ఏదో రోజున తన సొంతఊరు వెళ్లి ఆ అప్పులన్నీ కూడా తీర్చేయాలి అని తీర్మానించుకున్నాడు- సొంత ఊరులో అందరి ముందూ తన పరువు, కుటుంబ పరువుపోయిన చోట తన మోసగాడు కాదు అని చెప్పాలి.

సొంత వ్యాపారం పుంజుకుంది భగవంతుడి దయవల్ల,దానితో తన సొంత ఊరుకు వెళ్లి అందర్నీ పిలిచి బాకీలన్నీ తీర్చాడు.

ఆ అప్పులవాళ్లలో ఓ చిన్న సైజు రౌడీ కూడా ఉన్నాడు,అతనికీ కబురు చేసాడు, రమ్మని.ఆ వ్యక్తికీ మూడు లక్షల రూపాయలు ఇవ్వాలి-మొదటి తడవుగా ఒక లక్షన్నర ఇద్దామని తెచ్చాడు.

అతను రమేష్ హోటల్ రూంకి వచ్చాడు,రమేష్ తాను బల్లమీద పెట్టిన లక్షన్నర ఆ వ్యక్తి చేతికి ఇచ్చాడు-మిగిలినవి కూడా ఇస్తాను త్వరలో అని.

ఆ వ్యక్తి ఆ డబ్బులు తీసుకోకుండా ‘‘రమేష్ గారు నేను వచ్చింది డబ్బులకు కాదు; ఈ ఊళ్ళో ఇలా బతికిన మీరు ఇన్ని సంవత్సరాలు ఏమయిపోయారు,ఎక్కడ వున్నారు,ఏం చేస్తున్నారు- అది తెలుసుకోవడానికే వచ్చాను తప్ప డబ్బులకు కాదు’’ అన్నాడుట.

ఆ మాటలకు రమేష్ కళ్ళలో నీళ్లు తిరిగాయి,తన చిన్ననాటి స్నేహితులు, తన ద్వారా సాయం పొందినవాళ్ళు మొహం చాటేశారు.

రమేష్ తేరుకుని, ‘‘వద్దండి, ఇప్పుడు ఈ డబ్బులయినా వున్నాయి కాబట్టి ఇస్తున్నా, తర్వాత ఎలా ఉంటుందో తెలియదు నా పరిస్థితి.రేపు మా పిల్లలు ఈ ఊరు వచ్చినప్పుడు వాళ్లకి అవమానం జరగకూడదు నావల్ల’’ అన్నాడు

‘‘మీరు డబ్బులు ఇవ్వకపోయినా పర్వాలేదు,మళ్ళీ జీవితంలో తేరుకున్నారు-అదేచాలు’’ అన్నాడు ఆ వ్యక్తి.

రమేష్ బలవంతం చేయడంవల్ల ఆడబ్బు తీసుకుని ‘‘రమేష్ గారు మీరు మిగతా డబ్బులు ఇవ్వక పోయినా నేను ఏమీ అనుకోను, మీరు ఇవ్వక్కర్లేదు, -నాదగ్గర లెక్కకి మించిన డబ్బు ఉంది-మీఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి’’ అని చెప్పి వెళ్ళిపోయాడు!

అందరు పిల్లలు డిగ్రీలు పూర్తి చేశారు,పెద్ద కొడుకు ఓ చిన్న ఉద్యోగంలో చేరాడు. రెండో వాడికి "హెయిర్ స్టైల్" రంగంలో ఆసక్తి ఉండటం వల్ల హైదరాబాద్ పంపి కోర్స్ లో చేర్పించాడు-కేరళ లో ఓ పెద్ద బ్యూటీ సెలూన్ (ఆడవాళ్ళకి, మగవాళ్ళకి) ఓ ఏడాదిన్నరక్రిత్రం ఆరంభించాడు.బాగా నడుస్తున్న సమయంలో- కోవిడ్ బాగా వ్యాపారాన్ని దెబ్బకొట్టింది- కొన్ని నెలలుగా పునః ప్రారంభించాడు-మాదిరిగా నడుస్తోంది-కలియుగంలో ధర్మం కుంటిపాదంపై నడుస్తున్నట్టు.తొందర్లో అంతా సర్దుకుంటుందని ఆశిద్దాం;మూడో అతను తనకు వ్యాపారంలో సహాయంగా ఉన్నాడు.

రెండో పిల్లాడు ఎవరో అమ్మాయిని ప్రేమించడంతో పెద్దవాడికి పెళ్ళి చెయ్యకుండానే ఈ అబ్బాయికి పెళ్లి చేసాడు బెంగళూరులో 2018లో -నేనూ నా భార్య కూడా ఆ పెళ్ళికి వెళ్ళాం- పాత మిత్రుల్లో నేను ఒక్కడినే వెళ్ళింది- పిల్చింది నన్నొక్కడినే!

2015 లో అనుకుంటా నాకు పదమూడేళ్ల తర్వాత రమేష్ నుంచి ఫోన్ వచ్చింది;

మొదటి మాటలోనే గుర్తు పట్టా,పేరు కూడా చెప్పా "అవును మూర్తి నేనే" అన్నాడు.నాకైతే మాటే రాలేదు నోటి వెంట- ఏడుస్తూనే ఉన్నా కొద్దిసేపు. ఆనందంతో, కాసేపయినా తర్వాత తేరుకొని అడిగా!

"ఏమయిపోయావు ఇన్నేళ్లు,నీ గురించి ఎన్నేళ్లు ఆలోచిస్తూనే ఉన్నా ఏమయి పోయావో అని.చెప్పొద్దూ నీకు ఏమయినా అయిందా, నువ్వు అసలు లేవేమో అనే ఆలోచనలే" అన్నాను అప్పుడు-తాను తన కథ అంతా చెప్పాడు.

"తర్వాత నేను హైదరాబాద్ వచ్చాను మూర్తి, నీకు కూడా 25000 రూపాయలు ఇవ్వాలి (నాకైతే ఏమాత్రం గుర్తు లేదు) నేను అన్నా "పిచ్చి ఎక్కిందా నీకు ఏమైనా- నాకయితే గుర్తే లేదు, అయినా ఇన్నేళ్ల తర్వాత నువ్వు ఉన్నావని తెలిసింది అదే పదివేలు. నాకైతే డబ్బు వద్దు, కానీ నిన్ను మాత్రం చూడాలి వెంటనే అన్నా"

జూబిలీ హిల్స్ లో తాను వుండే హోటల్ పేరు చెప్పి రమ్మన్నాడు, నేను వెంటనే నా కార్ లో అక్కడికి వెళ్లాను.రూములో అతన్ని చూసి కావులించుకుని ఏడ్చేసా- కాస్త తేరుకున్న తర్వాత తన కథ మొత్తం చెప్పాడు.

ఇలాంటి సంఘటనలు సినిమాల్లో చూస్తాం,కథల్లో చదువుతాం, నిజజీవితంలో అందునా ఒక ఆత్మీయుడికి జరగటం చాలా చాలా అరుదు.

రమేష్ కి ఊబకాయం వచ్చింది,అందరూ బాగున్నారని వ్యాపారం కూడా బాగుందని చెప్పాడు, నేను సంతోషంగా మళ్ళీ కలుస్తా అని చెప్పా.

అప్పటి నుంచి తనతో కాంటాక్ట్ లో ఉన్నా, మా తోబుట్టువుల్లో,అందరికీ అతను తెలుసు, అందుకని మా వాళ్లందరికీ ఫోన్ చేసి మరీ చెప్పాను, అందరూ చాలా ఆనందించారు రమేష్ వార్త తెలిసి.

తన గురించి రాయాలనే తాపత్రయంలో- వరుస క్రమంలో సంఘటనలు రాసినట్టు లేదు!

విధి వంచితులయినా- ఆత్మ స్థైర్యంతో జీవితాల్లో నిలదొక్కుకున్నారు-ముఖ్యంగా మా స్నేహితుడి భార్య గురించి చెప్పుకోవాలి- అచ్చమైన సహధర్మచారిణి లాగా- స్వతహాగా స్థితిమంతురాలైనా- పరిస్థితులకు అనుగుణంగా భర్తకు చేదోడు వాదోడుగా ఉంది,పిల్లలు కూడా బుద్ధిమంతులు.

ఆమె వైపు గానీ, నా స్నేహితుడి కుటుంబంవైపు గానీ సంబంధాలు లేకుండా ఉండిపోయారు- వీళ్ళ పరిస్థితులకు వాళ్ళ వాళ్ళు దూరంగా వెళ్లిపోయారు- ఎక్కడ సాయం చేయాల్సి వస్తుందో అని- సమాజంలో ఇలాంటివాళ్ళు ఎక్కువమంది ఉన్నారు - నా స్నేహితుడిలాంటి వాళ్ళూ ఉన్నారు. మంచితనంతో బతుకుతూ భగవంతుడి మీద భారం వేయకలిగితే-ఎంత కష్టమైనా జీవితాలు వెళ్లిపోతాయి-

కొద్ది ఒడిదుడుకులు ఉన్నా కూడా.

నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంటుంది- ఒక స్థాయిలో ఉన్న మనిషి- కలలో కూడా ఊహించని పరిస్థితుల్లోకి నెట్టబడటం.నిలదొక్కుకోవడం, నిలబడటం, సంసారాన్ని నిలబెట్టడం అనేది అందరివల్లా సాధ్యం అయ్యే పని కాదు.

అలాంటి వాడు నా ఆప్తమిత్రుల్లో ఒకడైనందుకు ఖచ్చితంగా గర్వపడతాను- అతని అనుభవించిన పరిస్థితులకి తల్లడిల్లిపోయినా!

చల్లగా, పదికాలాలపాటు వాళ్ళ కుటుంబం సాగాలని ఆశిస్తూ....

ఎందుకో ఇది మీ అందరితో పంచుకోవాలని అనిపించింది!

మనలో మన మాట, నాకు తెలిసిన కొన్ని వందలమందిలోగానీ, సాన్నిహిత్యంగా తెలిసిన కొద్దిమంది సన్నిహితులలోగానీ, నా మిత్రుడు పడ్డ కష్టాల్లో పదిశాతం కంటే ఎక్కువ వారి జీవితాల్లో చవిచూసి ఉండరు- ఒకశాతం అటూ ఇటూగా.ఇలాంటి వాళ్ళ జీవితాలు,వారి అనుభవాలు, దాదాపుగా ఎక్కడో వినివుంటాం గానీ, మనమెవరమూ బాధితులం కాదు- నాకు తెలిసినంతవరకూ.అంటే మనం అందరమూ అదృష్టవంతులము, దేవుడి దీవెనలు ఉన్నవాళ్లమేగా. ఉన్నదానికి, ఉన్నవాటికి, ఉన్నవాళ్ళకి విలువ ఎక్కువ ఇవ్వడం మొదలుపెడదాం మన జీవితాల్లో!

జీవితం అన్నాక కష్టాలు లేకుండానూ, రాకుండానూ ఉండవు “పీత కష్టాలు పీతవి, అంబానీ కష్టాలు అంబానీవి”అలా చెప్పుకుంటే.చిన్నపాటి కష్టమొచ్చినా వగచడం మానేద్దాం, పెద్దకష్టం వచ్చినప్పుడు, ఇలాంటివాళ్ళ గురించి తల్చుకుంటే స్ఫూర్తి కలుగుతుంది.

ఇంతా విన్నందుకు మీ అందరికి నా కృతజ్ఞతలు

## సమాప్తం!!!